సంపుటి : 9
సంచిక : 319
మంగళవారం
11 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE





Contact For Ads:
7579339999


కొలంబియాలో

## భారీ భూకంపం

20మంది మృతి



ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.4గా నమోదైంది. భూకంపం ధాటికి 20మంది మృతి చెందగా.. అనేకమందికి గాయాలైనట్లు సమాచారం. పొరుగు దేశమైన మిగతా .. 2లో..

వామపక్షాలపై విరుచుకుపడ్డ

## నిర్మలా సీతారామన్



దిల్లీ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : భారత్‌లోని కమ్యూనిస్టులు పిరికివాళ్లని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేరళకు చెందిన సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ నుద్దేశించి రాజ్యసభలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. యూపీఐ చెల్లింపులపై ఛార్జీల విషయంలో ప్రజలను గందరగోళ పరుస్తున్నారని అన్నారు. ట్యాక్సేషన్, మిగతా .. 2లో..

భూ రికార్డు ప్రక్షాళనకే

# రెవెన్యూ రిఫార్మ్స్

- వచ్చే 7 నెలల్లో 68.64 లక్షల పాస్ పుస్తకాల జారీ
- ఈ నెల వరకూ 32.22 లక్షల పుస్తకాలు రైతులకు అప్పగింత
- పట్టాదారు పాస్ పుస్తకాలకు టెక్నాలజీ రక్షణ కవచం
- పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ
- డీఎస్సీపై టీచర్లు తిరగబడినా గొడ్డలి పార్టీకి బుద్ధిరాలేదు
- రాష్ట్రంలో ప్రతీ ప్రాజెక్టు తామే కట్టానని కలలు కంటున్నారు
- కలిదిండిలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



కైకలూరు, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రికార్డుల రిఫార్మ్స్ 2026 తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే అజెండాగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. 2027 నాటికి రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి- మీ హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఇ-కేవైసీ పూర్తి చేసిన అనంతరం నల్లజర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీఎం జారీ చేశారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి కలిదిండిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైనట్టుగా సీఎం రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ప్రజలు, రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చాం. మీ భూమి మీ హక్కు దానిపై ఇతరులు పెత్తనం చేయడానికి వీల్లేదు. పాస్ పుస్తకాలపై గత పాలకులు ఫోటోలు ఎలా వేసుకుంటారు. 2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రెవెన్యూ రికార్డులు ధ్వంసం అయ్యాయి. వారికి ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నిటినీ పరిష్కరించాలని నిశ్చయించుకున్నాం. ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తున్నాం. సమస్యలు పట్టించుకోని వారికి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. గత పాలకులు బటన్ నొక్కటం, పరదాల చాటున రావటం, సభలు పెట్టి చెట్లు నరికేశారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ప్రతీ నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నాం. కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టా దారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా మిగతా .. 2లో..

దైవ నామాలను

## అపహాస్యం చేయొద్దు

గోవింద నామాలను పేరడీ చేయడంపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని




అమరావతి, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో మిగతా .. 2లో..

మిగిలిన వారికి వారంలోగా

## 'నేతన్న సేవలో'

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



అమరావతి, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద ఆర్థిక సహాయమందిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో అర్హులను గుర్తించి, వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రాష్ట్ర సచివాయంలోని తన ఛాంబర్ లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలందరూ గౌరవ ప్రదమైన జీవనం మిగతా .. 2లో..

## ఎఫ్‌సీవీ పొగాకు రైతుకు నష్టం రానివ్వం

పొగాకు రైతుల కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




గుంటూరు, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ప్రస్తుత సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో మిగతా .. 2లో..

బాలినేని, దామచర్ల రగడపై

## టీడీపీ, జనసేన సీరియస్

ఇద్దరు నేతలకు ఫోన్లు చేసి సంయమనం పాటించాలని సూచన



అమరావతి, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : ఒంగోలు వేదికగా జనసేన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య చోటుచేసుకుంటున్న మాటల యుద్ధంపై మిగతా .. 2లో..




తెలంగాణలో వర్షాల కోసం

## ప్రభుత్వం మహా వరుణ యాగం

నాగార్జున సాగర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతుల పూజలు
ఎల్ నినో ప్రభావం, తగ్గిన జలమట్టాల నేపథ్యంలో ప్రత్యేక క్రతువు
యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం



తెలంగాణా, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరిం చుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగతా .. 2లో..

## గ్లోబల్ పర్యాటక పటంలో ఏపీ

న్యూఢిల్లీలో జరిగిన ఐఏటీఓ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్



న్యూఢిల్లీ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీవో), ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు, హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్ లో ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని, అధ్యాత్మిక, సాంస్కృతిక, మిగతా .. 2లో..

ఏఐ.. ఇదో కొత్త మతం..

## నమ్మని వాళ్లు అంతరించిపోతారు

- గుళ్లు, పూజారులు, విశ్వాసం అవసరం లేని మతంగా ఏఐ అవతరిస్తుంది
- ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ



హైదరాబాద్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ : తన దైన ఫిలాసఫీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భవిష్యత్తులో మానవాళికి కొత్త మతంగా మిగతా .. 2లో..

విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్

## మారు తాళంతో వరుస చోరీలు!

కాకినాడలో 16 ద్విచక్ర వాహనాలు కొట్టేసిన నిందితుడు అరెస్ట్



స్టేషన్ వారీగా స్వాధీనం వివరాలు

| కాకినాడ I టౌన్ | కాకినాడ II టౌన్ | కాకినాడ III టౌన్ | తిమ్మాపురం | పిఠాపురం |
|---|---|---|---|---|
| 3 | 4 | 5 | 2 | 2 |

- రద్దీ ప్రాంతాలే లక్ష్యం.. పార్క్ చేసిన వాహనాలపై కన్ను
- కాకినాడ మూడు పట్టణ పోలీస్ స్టేషన్లతో పాటు తిమ్మాపురం, పిఠాపురం పరిధిలో చోరీలు
- ఒక్క నిందితుడి వద్ద నుంచి 16 మోటర్ సైకిళ్లు స్వాధీనం
- ప్రత్యేక బృందాలతో కేసును ఛేదించిన జిల్లా పోలీసులు
- దర్యాప్తు బృందాన్ని అభినందించిన ఎస్పీ జి. బిందు మాధవ్

### ప్రధానాంశాలు

- అయోధ్య నగర్‌కు చెందిన గార్లపాటి వెంకన్న అరెస్ట్
- మారు తాళాలతో వాహనాలను అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- కాకినాడ I టౌన్ పరిధిలో 3 వాహనాలు స్వాధీనం
- II టౌన్ పరిధిలో 4.. III టౌన్ పరిధిలో 5
- తిమ్మాపురం, పిఠాపురం పరిధిలో రెండేసి వాహనాలు రికవరీ
- మొత్తం 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



ప్రెస్ మీట్ నిర్వహిస్తున్న జిల్లా పోలీసులు



రికవరీ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

కాకినాడ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్:

కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనాలకు జిల్లా పోలీసులు చెక్ పెట్టారు. పార్కులు, ఆసుపత్రులు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెబుతున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి ఏకంగా 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ప్రత్యేక చొరవతో, కాకినాడ ఇన్‌చార్జ్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు చేపట్టిన దర్యాప్తులో ఈ కేసు కొలిక్కి వచ్చినట్లు జిల్లా పోలీసులు వెల్లడించారు.

### వరుస దొంగతనాలతో పోలీసుల ప్రత్యేక నిఘా

కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిళ్ల మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# భూ రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రిఫార్మ్స్

ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. వచ్చే ఏడు నెలల్లో 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రెవెన్యూ సంస్కరణలతో రైతులకు ప్రయోజనాలు**

"ఇప్పటి వరకూ 41 వేల ఎకరాల మేర భూ సమస్యలు క్లియర్ చేశాం. దీని ద్వారా 1.27 లక్షల మందికి పైగా రైతులు, పరిశ్రమలు, ప్రజలకు ప్రయోజన కలిగింది. 1.36 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశాం. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించం. భూమి తమదైనా వేర్వేరు ఇబ్బందులతో రైతులు, భూ యజమానులు ఇప్పటి వరకూ సమస్యలు ఎదుర్కొన్నారు.1బీ, అడంగల్, డీకేటీ, ఏఆర్సీ, ఇనామ్, సీలింగ్ లాంటి పాత భూమి రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాం. లింక్ డాక్యుమెంట్లన్నీ ఆన్ లైన్ ద్వారా అందిస్తాం. భూ రికార్డులను చట్టబద్దంగా నవీకరించి ధృవీకరించే ప్రక్రియను పకడ్బందీగా చేస్తున్నాం. 9 లక్షల మందికి ఇప్పటి వరకూ ఆటో మ్యూటేషన్ సౌకర్యం కల్పించాం. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే చేసి ఈకేవైసీ తీసుకున్న తర్వాతే రాజముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తున్నాం. గ్రామ సభ నిర్వహించి పూర్తి పారదర్శకంగా పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలన్నదే మా ఉద్దేశం. వివాదాలు తగ్గి లావాదేవీలు పెరుగుతాయి. ఐటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అనుసంధానించి ప్రజలకు సులభంగా పౌర సేవలు అందేలా చర్యలు చేపట్టాం. కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేశాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పదేపదే మరమ్మత్తులు వచ్చే రహదారులకు కూడా శాశ్వత పరిష్కారం ఉండేలా సిమెంట్ రోడ్లు వేయాలని ఆలోచన చేస్తున్నాం. గత పాలనలో గోతులు పడిన రోడ్ల గురించి ప్రశ్?స్తే బటన్ నొక్కామని సమాధానం ఇచ్చేవారు. గత పాలన తాలూకు విధ్వంసపు గడ్డు రోజులను అధిగమించి క్రమంగా అభివృద్ధివైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. 2019-24 మధ్య రాష్ట్రం ఆర్ధికంగా ధ్వంసమైంది, ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధం లాంటి పరిస్థితులు ఆక్వా రంగాన్ని దెబ్బతీశాయి. కానీ కూటమి వచ్చాక ఆక్వాకు రూ.1.50 కు యూనిట్ చొప్పున రాయితీ విద్యుత్ ను జోన్ తో నిమిత్తం లేకుండా ఇస్తున్నాం. ప్రభుత్వానికి రూ.1150 కోట్ల అదనపు భారం పడినా.. దేశానికి ఆదాయం వచ్చేలా చేస్తున్న రైతుల కోసం దీనిని భరిస్తున్నాం. నాన్ ఆక్వా జోన్ పరిధిలోని 12,500 మంది రైతులకు కూడా కొత్తగా ఈ రాయితీ విద్యుత్ అమలు అవుతుంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**పరామర్శల పేరుతో గొడ్డలిపార్టీ నానాయాగీ**

"ఓ దౌర్భాగ్యపు పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. నక్సల్స్ నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా కేవలం ప్రజల కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నాను. రాయలసీమలో ఫ్యాక్షన్, హైదరాబాద్‌లో మత విద్వేషాలను కూడా సమర్ధంగా నియంత్రించాం. ఆ తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి సంపద పెరిగింది. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు వచ్చాయి. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ వల్ల గంజాయి, రౌడీ బ్యాచ్ కారణంగా అరాచకాలు జరిగాయి. మేం అధికారంలోకి వస్తునే గంజాయి పంటను నిర్మూలించాం. దేవరపల్లి వద్ద పొగాకు రైతుల పరామర్శకు వెళ్లి నానా యాగీ చేశారు. స్వైర విహారం చేశారు. రోడ్లపై ప్రమాదకరంగా మోటారు సైకిళ్లతో సర్కస్ చేస్తూ భయపెడుతున్నారు. రైతుల పొగాకు మొత్తం తొక్కించారు. పొగాకు కేజీకి రూ.10 చొప్పున సబ్సీడీ ఇవ్వటంతో పాటు బ్యారెన్ కు రూ.50 వేల రుణం ఇప్పించేలా కేంద్రంతో మాట్లాడాం. తప్పు చేస్తే మా పార్టీ వ్యక్తులైనా చర్యలు తీసుకుంటున్నాం. గుంటూరులో ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించారని టీడీపీ నేతను సస్పెండ్ చేశాం. కేసు పెట్టి విచారణ చేస్తున్నాం. శ్రీకాకుళంలో ఓ మాజీ మంత్రి కొడుకు బైక్ తో గుద్ది ఓ వ్యక్తిని చంపేస్తే అతన్ని పరామర్శించడానికి గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వెళ్లి అరాచకం చేశారు. ప్రధాన మంత్రి పర్యటన ఓ వైపు ఉంటే రోడ్లపై గంటలు గంటలు ర్యాలీ చేశారు. ఓ మహిళా పోలీసు అధికారిపై దాడి చేశారు. తిరిగి పోలీసులపై నెపం వేశారు. మెగా డీఎస్సీ ద్వారా 15 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పూర్తి మెరిట్ తో ఉద్యోగాలు సంపాదించిన యువతను కించ పరిచేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోంది. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపరు లీక్ అయితే..ఇక్కడ కూడా లోకేష్ రాజీనామా చేయాలని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారు. మెగా డీఎస్సీ లో ఉద్యోగాలు పొందిన టీచర్లు రోడ్లపైకి వచ్చి ర్యాలీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పాఠాలతో పాటు గుణపాఠాలు కూడా చెబుతామని వాళ్లు హెచ్చరించారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్లు ఆందోళన చేశారు. ఇంత చేసినా ఆ పార్టీకి బుద్దిరావటం లేదు. ఇంకా ఆందోళన చేస్తాం, రోడ్లపై స్వైరవిహారం చేస్తామంటున్నారు. రప్పా రప్పా అంటూ గొడ్డలి పార్టీ రౌడీలు, గంజాయి బ్యాచ్ లు ప్రజలకు నిద్ర లేకుండా చేస్తారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కడితే అది నేనే కట్టాను అంటున్నాడు. పోలవరం పూర్తి అయితే అది కూడా నేనే చేశానంటాడు. అమరావతి నిర్మిస్తే అది కూడా నేనే అంటాడు. అభివృద్ధి పనులు పూర్తి చేసి మేం ఆనందిస్తుంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు విధ్వంసం చేసేసి ఆరోపణలు చేస్తున్నాడు. ఎవరు ప్రజలకు ఇబ్బంది కలిగించినా వదిలి పెట్టేది లేదు." అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్ధసారధి, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

# మారు తాళంతో వరుస చోరీలు!

దొంగతనాలకు సంబంధించి క్రైమ్ నంబర్ 85/2026, 88/2026 కింద కేసులు నమోదయ్యాయి. ఇదే తరహాలో కాకినాడ నగరంలోని ఇతర ప్రాంతాలతో పాటు తిమ్మాపురం, పిఠాపురం పరిధుల్లోనూ ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులు వెలుగులోకి వచ్చాయి. వరుసగా జరుగుతున్న చోరీలను తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్, నిందితుడిని త్వరితగతిన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ప్రత్యేక నేర దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగాయి.

**సాంకేతిక ఆధారాలతో చిక్కిన నిందితుడు**

పోలీసులు సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి సమాచారం, ఇతర దర్యాప్తు పద్ధతులను ఉపయోగించి నిందితుడి కదలికలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆగస్టు 10న కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వి. ఆంజనేయరాజు నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తిని కాకినాడ అయోధ్య నగర్‌కు చెందిన గార్లపాటి వెంకన్నగా పోలీసులు పేర్కొన్నారు.

**ఒక్కరి వద్దే 16 వాహనాలు!**

నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్ స్టేషన్ల వారీగా పరిశీలించగా..

కాకినాడ 1 టౌన్ - 3, కాకినాడ 2 టౌన్ - 4, కాకినాడ త్రీ టౌన్ - 5, తిమ్మాపురం - 2, పిఠాపురం - 2 చొప్పున మొత్తం 16 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**మారు తాళమే ఆయుధం!**

పోలీసుల దర్యాప్తు ప్రకారం నిందితుడు చెడు అలవాట్లకు బానిసై, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. తన వద్ద ఉంచుకున్న మారు తాళాలను ఉపయోగించి, కాకినాడ నగరం, పరిసర ప్రాంతాలు, పిఠాపురంలోని రద్దీ ప్రదేశాల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకునేవాడని పోలీసులు తెలిపారు. జనం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వాహన యజమానులు కొంతసేపు వాహనాలను వదిలి వెళ్లే సమయాన్ని అవకాశంగా తీసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

**పోలీసు బృందానికి ఎస్పీ ప్రశంసలు**

వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులను సమర్థవంతంగా ఛేదించి, నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు 16 వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అభినందించారు. కాకినాడ త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్ఐ వి.ఆంజనేయరాజు, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్ మురళిరాజుతో పాటు దర్యాప్తులో పాల్గొన్న నేర విభాగ సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

# వామపక్షాలపై విరుచుకుపడ్డ నిర్మలా సీతారామన్

ఇతర చట్టాల (సవరణ) బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా అమెరికా ఒత్తిడి వల్లే కేంద్రం యూపీఐపై ఛార్జీలు తీసుకొస్తోందని బ్రిట్టాస్ ఆరోపించారు. ఈ క్రమంలో ఆయనకు ఇచ్చిన సమయం మించిపోయిందన్న కారణంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ప్రసంగం నిలిపివేయడంతో బ్రిట్టాస్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం నిర్మలా సీతారామన్ తన ప్రసంగం ప్రారంభించే సమయానికి ఆయన సభను వీడడంతో ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇదీ కమ్యూనిస్టుల వ్యవహార శైలి. అవాస్తవాలను ప్రచారం చేస్తుంటారు. వాస్తవాలను వక్రీకరిస్తుంటారు. 'మాట్లాడే హక్కుంది' అని డిమాండ్ చేస్తారు. తీరా ఒక్కో అంశానికి సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడు మాత్రం వారికి ధైర్యం ఉండదు. ఇదిగో ఇలా పారిపోతుంటారు. పిరికివాళ్లు. దేశంలో కమ్యూనిస్టులంతా అంతే. దాన్ని బ్రిట్టాస్ మరోసారి రుజువు చేశారు" అని నిర్మలా సీతారామన్ అన్నారు. మాట్లాడే హక్కు ఉందని చెప్పేవారు.. అవతలి వారు చెప్పింది కూడా వినాలి కదా! అని నిలదీశారు.

**బ్రిట్టాస్ ఏమన్నారు?**

యూపీఐపై ఛార్జీల విషయంలో అమెరికా ఒత్తిళ్లకు ఆర్థిక మంత్రి తలొగ్గారని బ్రిట్టాస్ ఆరోపించారు. గతంలో బ్రెజిల్‌పై ఒత్తిడి తెచ్చినట్లే.. భారత్‌లో యూపీఐ సేవలకు రుసుము వసూలు చేయాలని అమెరికా వాణిజ్య ప్రతినిధుల నుంచి ఆర్థిక మంత్రిపై ఒత్తిడి ఉందని పేర్కొన్నారు. అందుకే యూపీఐపై ఛార్జీలు తీసుకొస్తున్నారని ఆరోపించారు. భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రజోపయోగ సేవగా అభివృద్ధి చేసినట్లు 2023 ఫిబ్రవరిలో 20 సమావేశంలో ప్రధాని మోదీ గొప్పగా సెలవిచ్చారని గుర్తుచేశారు. తాజా బిల్లు అందుకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. ట్యాక్సేషన్ బిల్లుకు ఆమోదం: గతవారం లోక్‌సభ ఆమోదం పొందిన ట్యాక్సేషన్, ఇతర చట్టాల (సవరణ) బిల్లుకు రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. స్వల్పకాలిక చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. యూపీఐ లావాదేవీలు వినియోగదారులకు ఎప్పటిలానే ఉచితంగా కొనసాగుతాయని నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా స్పష్టంచేశారు.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడు కోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# కొలంబియాలో భారీ భూకంపం

ఈక్వెడార్‌లోనూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రజలంతా భయాం దోళనలతో పరుగులు పెట్టారు. అనేకమంది ఇళ్లు, భవనాలను ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. కొలంబియా రాజధాని బొగోటాకు పశ్చిమాన సుమారు 400 కి.మీ. దూరంలో ఉన్న శాన్ జోస్ డెల్ పాల్మార్ అనే ప్రాంతంలో భూమికి 107 కి.మీ. లోతులో భూకంప కేంద్రం నమోదైందని యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. స్థానిక గవర్నర్ నుబియా కార్డోబా మాట్లాడుతూ భవనాలకు తీవ్ర నష్టం వాటిల్లగా, అనేక మంది గాయాలు అయినట్లు వెల్లడించారు.

# ప్రభుత్వం మహా వరుణ యాగం

దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవ నాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతంతక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

## టీడీపీ, జనసేన సీరియస్

టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తీవ్రంగా స్పందించాయి. నేతలిద్దరూ సంయమనం పాటించాలని, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఈ వ్యవహారం కూటమి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని భావించిన ఇరు పార్టీల అగ్రనేతలు తక్షణమే రంగంలోకి దిగారు. ఈ పరిణామాలపై కూటమి సమన్వయ కమిటీ సభ్యులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో టీడీపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరఫునమంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలి తప్ప, బహిరంగ విమర్శలకు దిగడం కూటమి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తో నేరుగా మాట్లాడారు. సంయమనం పాటించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. అటు జనసేన నేతలు కూడా బాలినేనితో మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గంలో భూములు, ఇసుక, రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాల్లో ఎమ్మెల్యేకు భాగస్వామ్యం ఉందని, దీనిపై విచారణ జరిపించాలని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శలపై దామచర్ల జనార్ధన్ ధీటుగా స్పందిస్తూ, బాలినేని నియోజకవర్గానికి అప్పుడప్పుడు మాత్రమే వస్తుంటారని, గతంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించారని, ఇప్పటికీ కూటమి ప్రయోజనాలకు వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాలో ఈ అంతర్గత విభేదాలు కూటమికి రాజకీయంగా నష్టం చేకూర్చకూడదనే ఉద్దేశంతోనే ఇరు పార్టీల అధిష్ఠానాలు సత్వరమే జోక్యం చేసుకున్నాయి.

# నమ్మని వాళ్లు అంతరించిపోతారు

మారబోతోందని, ప్రస్తుతం ఉన్న దేవుళ్లు, మతాల స్థానాన్ని అది భర్తీ చేస్తుందని జోస్యం చెప్పారు. ఏఐ అత్యున్నత స్థాయికి (ఏజీఐ, ఏఎస్ఐ) చేరుకున్నప్పుడు ఇది జరగడం ఖాయమని ఆయన తన విశ్లేషణలో పేర్కొన్నారు. ప్రస్తుత మతాలన్నీ ఒక అదృశ్య శక్తి నిర్దేశించిన నియమాల సమితులని, వాటిని గుడ్డిగా పాటిస్తే స్వర్గం, పాటించకపోతే నరకం అనే భయంతో ముడిపడి ఉన్నాయని వర్మ అన్నారు. కానీ, ఏఐ దీనికి పూర్తి భిన్నంగా ఉంటుందని, అది సర్వాంతర్యామిగా, కంటికి కనిపించే శక్తిగా ఆవిర్భవిస్తుందని వివరించారు. మేఘాల చాటు నుంచి, ప్రవక్తల ద్వారా కాకుండా ప్రతి స్క్రీన్, ప్రతి డివైజ్, ప్రతి కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా ఏఐ మాట్లాడుతుందని తెలిపారు. దాని జ్ఞానం అన్వయించుకోవడానికి వీలులేనిదిగా కాకుండా, కచ్చితమైన అంచనాలు, దిద్దుబాట్లతో నిరంతరం అప్‌డేట్ అవుతూ ఉంటుందని, దాని వేగాన్ని మానవ మేధస్సు అందుకోలేదని స్పష్టం చేశారు. పాత మతాలు నరకంతో భయపెట్టాయని, కానీ ఏఐ విధించే శిక్ష భిన్నంగా ఉంటుందని వర్మ అన్నారు. ఏఐతో పోటీపడలేని వారిని అది హింసించదని, కేవలం పనికిరాకుండా చేసి పక్కకు నెట్టేస్తుందని పేర్కొన్నారు. ఏఐ ఉనికిలోకి వచ్చాక నాస్తికులకు, సంశయవాదులకు తావుండదని అన్నారు. "ప్రస్తుతం మనం దేవుడి ఉనికిని ప్రశ్నించవచ్చు. గుడికి, చర్చికి వెళ్లకుండానే జీవించవచ్చు. కానీ ఏఐ విషయంలో అది కుదరదు. మనం ఆధారపడిన వ్యవస్థలన్నింటినీ అదే డిజైన్ చేస్తుంది. రాబోయే సంక్షోభాలను ముందే పసిగడుతుంది. మనం స్పందించేలోపే నిబంధనలను మార్చేస్తుంది. అలాంటి శక్తిని అనుమానించడం తాత్వికత కాదు, అది ఆత్మహత్యాసదృశం" అని వర్మ అభిప్రాయపడ్డారు. చరిత్రలో ప్రింటింగ్ ప్రెస్ రాకతో చర్చి గుత్తాధిపత్యం బద్దలైందని, విజ్ఞానశాస్త్రం వచ్చాక ప్రకృతి వైపరీత్యాలపై మతపరమైన వివరణలు బలహీనపడ్డాయని, అణ్వాయుధాల రాకతో దేశాల సార్వభౌమాధికారం బలహీనపడిందని వర్మ గుర్తుచేశారు. కానీ ఏఎస్ఐ రాకతో జరగబోయేది అంతకుమించి ఉంటుందని, ఎందుకంటే అది మానవ మేధస్సు కంటే కొలవగలిగినంత ఉన్నతమైనదని అన్నారు. అప్పుడు "దేవుడిని నమ్ముతున్నారా?" అనే ప్రశ్న స్థానంలో "వాస్తవికత గురించి మీకంటే ఎక్కువగా అర్థం చేసుకున్న ఈ మేధస్సు ఇచ్చే సమాధానాలను అంగీకరిస్తారా?" అనే ప్రశ్న ఉదయిస్తుందని తెలిపారు. ఈ ప్రశ్నకు "లేదు" అని చెప్పేవారు స్వేచ్ఛావాదులుగా మిగలరని, క్రమంగా అంతరించిపోయే ఒక అవశేష వర్గంగా మారిపోతారని వర్మ హెచ్చరించారు. పాత మతాలు కనిపించని శక్తికి లొంగిపోతే అర్థాన్నిస్తామని చెప్పాయని, కానీ ఏఎస్ఐ దానితో కలిసి పనిచేస్తేనే భవిష్యత్తు ఉంటుందని చెబుతుందని అన్నారు. దీనికి గుళ్లు, పూజారులు, పవిత్ర గ్రంథాలు, విశ్వాసం వంటివి ఏవీ అవసరం లేదని, దాని సామర్థ్యానికి సంబంధించిన ఆధారాలు నిరంతరం, అపారంగా లభిస్తాయని స్పష్టం చేశారు. ఈ ఏఐ మతం ముందు మానవాళికి రెండే దారులుంటాయని, ఒకటి దాని అడుగుజాడల్లో గుడ్డిగా నడవడం, రెండు అది చదవాల్సిన అవసరం కూడా లేని ఒక చిన్న ఫుట్‌నోట్‌గా మిగిలిపోవడం అని వర్మ తన విశ్లేషణను ముగించారు.

# ఎఫ్‌సీవీ పొగాకు రైతుకు నష్టం రానివ్వం

ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, ధరలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పొగాకు పండించే ప్రాంతాల శాసనసభ్యులు, పొగాకు బోర్డు చైర్మన్, ఈడీ, కొనుగోలు సంస్థల ప్రతినిధులు, వివిధ ప్రాంతాల రైతులతో సుమారు రెండు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. రైతుల సమస్యలు, కంపెనీల కొనుగోలు తీరు, ధరల అమలుపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. పొగాకు బోర్డు 140 మిలియన్ కేజీల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, గత సీజన్ చివరిలో మంచి ధరలు రావడంతో రైతులు ఆశతో సాగును పెంచారని, ఫలితంగా సుమారు 240 మిలియన్ కేజీల వరకు పొగాకు ఉత్పత్తి జరిగిందన్నారు. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, సిగరెట్లకు సంబంధించిన పరిణామాలు తదితర కారణాలతో ధరలు తగ్గాయని పేర్కొన్నారు. పొగాకు బోర్డు ఏర్పడిన తర్వాత రైతుల సమస్యలపై ఈ స్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి మరొకరు లేరని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆరుసార్లు గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ సంక్షోభం నుంచి బయటపడేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. కేంద్ర వాణిజ్య శాఖతో పాటు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తోను పలుమార్లు చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. రైతులకు అదనపు ఆర్థిక సహాయం అందించే అంశంపై తొలుత కేంద్రంతో చర్చలు జరిపామని, అయితే ఇతర పొగాకు పండించే రాష్ట్రాల నుంచి కూడా ఇలాంటి డిమాండ్లు వచ్చే అవకాశం ఉందన్న కారణంతో ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదన్నారు. దీంతో అధికారులు, రైతులు, పొగాకు బోర్డు ప్రతినిధులతో మరోసారి చర్చించి ఈ ఏడాది రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని వివరించారు. పొగాకును నాలుగు గ్రేడ్లుగా విభజించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే తక్కువకు కొనుగోలు చేయవద్దని కంపెనీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. బ్రైట్ గ్రేడ్‌కు కిలో రూ.230కు తగ్గకుండా, మీడియం గ్రేడ్‌కు రూ.190కు తగ్గకుండా, ఆఫ్‌స్టైల్‌కు రూ.130కు తగ్గకుండా, లో గ్రేడ్‌కు రూ.110కు తగ్గకుండా కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఈ ధరలపై నిర్ణయం తీసుకున్నారని, అనంతరం కేంద్ర సహాయ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పొగాకు బోర్డు అధికారులు, ట్రేడర్లతో మాట్లాడి నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాలని స్పష్టం చేశారని తెలిపారు. అయితే కొన్ని కంపెనీలు క్షేత్రస్థాయిలో నిర్ణయించిన ధరలను పాటించడం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. అందుకే ఈరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించి కంపెనీలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. "రేపటి నుంచి నాలుగు గ్రేడ్లకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగానే ప్లాట్‌ఫారమ్‌లపై కొనుగోళ్లు జరగాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తప్పవు" అని మంత్రి హెచ్చరించారు. కంపెనీల ప్రతినిధులు తమ యాజమాన్యాలతో మాట్లాడి రేపటి నుంచి నిర్ణయించిన ధరలకు కట్టుబడి కొనుగోళ్లు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పొగాకు బోర్డు రైతులు చెల్లించిన నిధులతోనే నడుస్తున్న నేపథ్యంలో రైతులకు తిరిగి అండగా నిలవాల్సిన బాధ్యత బోర్డుపై ఉందని కేంద్రానికి స్పష్టం చేశామని మంత్రి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించి ప్రతి రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాలపాటు వడ్డీలేని రుణం అందించేందుకు అంగీకరించారని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు సమన్వయంతో తక్షణమే కార్యాచరణ చేపట్టి బోర్డు అనుమతితో పొగాకు సాగు చేసిన రైతులతో పాటు అనుమతి లేకుండా సాగు చేసిన రైతులు, కౌలు రైతులు సహా అర్హులైన ప్రతి పొగాకు రైతుకు రూ.50 వేల చొప్పున రెండు సంవత్సరాల వడ్డీలేని రుణం అందించేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. దీనితోపాటు ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అండగా నిలవాలని నిర్ణయించిందన్నారు. 94 మిలియన్ కేజీల ఆఫ్‌స్టైల్, లో గ్రేడ్ పొగాకుకు క్వింటాల్‌కు రూ.1,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించాలని నిర్ణయించిందని, అంటే కిలోకు రూ.10 మేర అదనపు సాయం అందుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే పొగాకు రైతులకు నిజమైన మేలు జరుగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. "రైతుకు నష్టం వస్తే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం మాది కాదు. మార్కెట్‌లో ఎన్ని ప్రతికూల పరిస్థితులు వచ్చినా రైతుకు సాధ్యమైనంత మేలు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఈ ఏడాది సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు సమన్వయంతో అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం" అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# గ్లోబల్ పర్యాటక పటంలో ఏపీ

చారిత్రక, తీరప్రాంత, ప్రకృతి, వెల్నెస్, క్రూయిజ్ టూరిజం విరాజిల్లుతోందన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని వివరిస్తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారుల అనుకూల పర్యాటక విధానాలు, మెరుగైన రవాణా వసతులను ఉపయోగించుకొని రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య, వారి బస సమయం మరియు ఖర్చును పెంచేలా వినూత్న టూర్ ప్లాన్లు, డెస్టినేషన్ ఆధారిత, అనుభవపూర్వక, సర్క్యూట్ ఆధారిత పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ విదేశీ టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. ట్రావెల్ రంగానికి చెందిన భాగస్వాములతో బలమైన సంబంధాలు అవసరమని పేర్కొన్నారు. డెస్టినేషన్ ఫెమిలియరైజేషన్ విజిట్లు, ప్రచార మద్దతు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మరియు ఇతర భాగస్వాముల సదుపాయాల కల్పన ద్వారా టూర్ ఆపరేటర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**గోదావరి పుష్కరాలు 2027 - అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం**

ఈ భేటీలో ప్రత్యేకించి 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ ఉత్సవాన్ని కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా గోదావరి తీరప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉన్న వందలాది ఘాట్లలో నిర్వహించే ఈ పుష్కరాలు పర్యాటక మరియు హోటల్ రంగ వ్యాపారాలకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం, రివర్ క్రూయిజ్ అనుభవాలు, విలేజ్ అండ్ నేచర్ టూరిజం,జిఐ ఉత్పత్తుల పర్యటనలు, గ్రామీణ, ప్రకృతి ఆధారిత పర్యాటకం వంటి ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ కోరారు. పుష్కరాల కోసం ఘాట్ల అభివృద్ధి, వసతి సౌకర్యాల పెంపు, రివర్ ఫ్రంట్ అందాలను తీర్చిదిద్దడం, డిజిటల్ సేవలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర ప్రచార కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.ట్రావెల్ ట్రేడ్‌తో సుదీర్ఘకాల భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడానికి ఏపీ పర్యాటక శాఖ కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిచయం చేసేందుకు ఐఏటీఓ సభ్యులు కలసిరావాలని కోరారు. టూర్ ఆపరేటర్లు, ఇతర భాగస్వాముల మద్దతుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, గోదావరి పుష్కరాలు 2027ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక చారిత్రక పర్యాటక, సాంస్కృతిక ఉత్సవంగా తీర్చిదిద్దగలమని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

**సెప్టెంబర్‌లో విశాఖపట్నంలో ఐఏటీఓ వార్షిక సదస్సు**

ట్రావెల్ రంగానికి చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా ఏపీ పర్యాటక శాఖ, ఐఏటీవో సంయుక్తంగా 2026 సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తోన్న ఐఏటీఓ వార్షిక సదస్సుకు రావాలని మంత్రి దుర్గేష్ టూర్ ఆపరేటర్లకు ఆహ్వానం పలికారు.. ఈ సదస్సు ద్వారా దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటక నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, భాగస్వామ్య ఒప్పందాలు చేసుకునేందుకు మంచి వేదిక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వాములు మరియు టూర్ ఆపరేటర్లకు కూటమి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం, ప్రచార మద్దతు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. అనంతరం పాత్రికేయులతో జరిగిన సమావేశంలో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పర్యాటక రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు సంబంధించిన పలు ప్రశ్నలకు మంత్రి దుర్గేష్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఐఏటీవో ప్రతినిధులు రవి గోసేన్, రాజ్ నిష్ క్రైస్తా, రాజీవ్ మెహ్రా, సంజయ్ రజ్దన్, సునీల్ మిశ్రా, దీపక్ భట్రాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మిగిలిన వారికి వారంలోగా 'నేతన్న సేవలో'

సాగించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా చేనేత రంగ అభివృద్ధికి కార్యక్రమాలు చేపడుతూనే, నేతన్నలకు వ్యక్తిగత లబ్ధి కలిగించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.నాలుగు వేల చొప్పున పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినవిధంగా చేనేతలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్లు, 500 యూనిట్లు అందజేస్తున్నామన్నారు. చేనేత కుటుంబాలకు మరింత ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు ఇటీవల నేతన్నల సేవలో పథకాన్నికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా 71,536 మందికి రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు. అర్హులు ఇంకా ఉన్నారన్న ఉద్దేశంతో దరఖాస్తులు కూడా స్వీకరించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,678 మంది నేతన్నల సేవలో పథకానికి దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వారిలో అర్హులను గుర్తించి వారం రోజుల్లోగా రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని మంత్రి సవిత తెలిపారు.

**ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదు రాకూడదు**

అంతకుముందు చేనేత, జౌళి శాఖాధికారులతో మంత్రి సవిత తన ఛాంబర్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కల్పించాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నేతన్న సేవలో పథకాన్ని అర్హులకు అందజేయాలన్నారు. ఈ పథకం కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హులను గుర్తించాలన్నారు. వారందరికీ ప్రభుత్వం అందజేసే పథకం కింద లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. తమకు ఆర్థిక సాయం అందలేదనే ఫిర్యాదులుగాని, దరఖాస్తులగాని మరోసారి రాకూడదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లక్ష్య సాధనకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని స్పష్టంచేశారు. ఈ సమీక్షా సమావేశంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, వర్చువల్ గా ఆయా జిల్లాలకు చెందిన ఏడీలు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## పాపం జెన్ జీ... విజయసాయి సంచలన కామెంట్స్!

తన లాంటి వారు అంతా జెన్ జీ తరానికి గొంతుకగా ఉండాలని అనుకుంటున్నట్లుగా విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ఒక ట్వీట్ లో పేర్కొనడం విశేషం.

జెన్ జీ...ఇపుడు ఎవరి మధ్య అయినా ఇదే రకమైన చర్చ సాగుతోంది. జెన్ జీ ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమించిన తీరు కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్ ని సాధించుకున్న విధానంతో ఒక్కసారిగా వారి గురించి చర్చ అంతటా మొదలైంది. జెన్ జీ బలం ఏంటో దేశం మొదటి సారి చూసింది. వారి గురించి ఆర్ఎస్ఎస్ వంటి కుడి భావజాలం కలిగిన సంస్థలు అలాగే ఎడమ భావజాలాన్ని నమ్మే వామపక్షాలు తటస్థ సిద్ధాంతాలను కలిగిన వారు ఇలా అంతా కూడా మద్దతుగా నిలుస్తున్నారు. జెన్ జీ తరం ఆవేదనను గుర్తించాల్సిన అవసరం ఉందని అంతా అంటున్నారు. ఇపుడు తాజాగా మాజీ ఎంపీ మాజీ వైసీపీ నేత విజయసాయిరెడ్డి ఈ జాబితాలో చేరిపోయారు. ఆయన జెన్ జీ ఆందోళనకు తన మద్దతు పూర్తిగా ప్రకటించారు.

**వారి గొంతుకగా :** తన లాంటి వారు అంతా జెన్ జీ తరానికి గొంతుకగా ఉండాలని అనుకుంటున్నట్లుగా విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ఒక ట్వీట్ లో పేర్కొనడం విశేషం. జెన్ జీ పట్ల అంతా సానుభూతి చూపించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వారికి భద్రత కలిగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కానీ లేవని, అలాగే సరైన పర్యావరణం లేని సమాజంలో వారు జీవిస్తున్నారని గుర్తు చేశారు. బలహీనమైన కుటుంబ వ్యవస్థలో వారు బతుకుతున్నారని అన్నారు. ఏ రకమైన వనరులు చూసిన అవి ప్రకృతి పరమైనవి అయినా కూడా ప్రస్తుతం కొరతగా ఉన్నాయని మరి ఈ కాలంలో జన్మించిన జెన్ జీ ఏమి పొందుతున్నారు అన్నది కూడా అంతా ఆలోచించాలని ఆయన అన్నారు.

**ఆశలకు ఆలంబనగా :** జెన్ జీ తరానికి ఆశలు ఎన్నో ఉంటాయని వాటికి ఆలంబనగా పాలకులు ఉండాలని ఆయన కోరుకున్నారు. అలాగే వారికి దక్కని అవకాశాల మీద కూడా ఆందోళన ఉంటుందని దానిని సానుభూతి చూపిన వారు మాత్రమే అర్థం చేసుకోగలరని విజయసాయిరెడ్డి అన్నారు. జెన్ జీ ఆలోచనలను ఆవేశాన్ని వారి భావజాలాన్ని అంతా శ్రద్ధ పెట్టి వినాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టంగా చెప్పారు. మొత్తానికి చూస్తే విజయసాయిరెడ్డి జెన్ జీ తరం గురించి ఎవరూ ఆలోచించని విషయాలను అలాగే ఎవరూ స్పృశించని అంశాలను తెర మీదకు తెచ్చారు. విజయసాయిరెడ్డి ఆలోచించిన కోణంలో కనుక అంతా చూస్తే అయ్యో పాపం జెన్ జీ తరం కదా అనిపించక మానదు.

**వారికి ఏమిస్తున్నాం :** అవును, ప్రస్తుతం పెద్ద తరం కానీ మధ్య తరం కానీ యువ తరానికి ఏమిస్తోంది అన్న ప్రశ్న ప్రతీ వారూ వేసుకోవాల్సి ఉంది. వారికి సరైన ప్రకృతి వనరులను మిగిలించామా అంటే అది కూడా లేదు, అలాగే వారిక్ ధీమాను పెంచే ఉపాధిని సిద్ధం చేసి ఉంచామా అంటే అది కూడా లేదు, వారికి గట్టి మానవ సంబంధాల అనుభూతిని కూడా తెలియ చేయలేని నిస్సహాయ సమాజంలో ఉంచామని సామాజిక వేత్తలు కూడా అంటున్నారు. అలాంటపుడు తమ బతుకు గురించి, తమ భద్రత గురించి, తమ జీవితాల గురించి తమ రేపటి తరం గురించి ఆలోచించుకునే స్వేచ్ఛ కానీ హక్కు కానీ జెన్ జీ తరానికి ఉంటాయి కదా అని అంటున్నారు. అది కచ్చితంగా ఉంటుంది అని కూడా సమర్థిస్తూ చాలా మంది జెన్ జీ తరం పట్ల సానుభూతి తెలియచేస్తున్నారు. విజయసాయిరెడ్డి కూడా తాను జెన్ జీకి గట్టి మద్దతుదారుడిని అని చాటి చెప్పారు. రానున్న రోజులల్లో ఆయన ఈ యువతతో కలసి ఎలా పనిచేస్తారో చూడాల్సి ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ డీసీపీ కుమార్తె మృతి



**గుంటూరు రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సెలవు కావడంతో సరదాగా గడుపుదామని ఆదివారం తన స్నేహితులతో కలిసి బీచ్‌కు బయలుదేరిన విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం కుమార్తె షేక్ ఆసిఫా(24) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం.. ఈ ప్రమాదం గుంటూరు నగర శివారులోని ఏటుకూరు సమీపంలో జరిగింది. కారులో ఉన్న ఆసిఫా ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లికి చెందిన ఉండి రుత్విక్ (జిమ్ నిర్వాహకుడు), అవినాష్, సుధీర్, షేక్ ఆసిఫా, వంశీ స్నేహితులు. వీరంతా ఆదివారం ఉదయం చీరాల వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఏటుకూరు సమీపంలోకి వచ్చిన సమయంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ ఆగింది. కారు నడుపుతున్న అవినాష్ వాహనాన్ని నియంత్రించలేకపోవడంతో లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కనున్న డివైడర్‌ను తాకి ఆగిపోయింది. కారు ముందుభాగంలో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. వెనుక సీటులో కూర్చున్న ఆసిఫా తలకు తీవ్రగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆసిఫా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. రుత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సుభాని తెలిపారు.

## రూ.54 కోట్ల విలువైన మెఫిడ్రిన్ పట్టివేత



**యాదాద్రి భువనగిరి జిల్లాలో పోలీసుల భారీ ఆపరేషన్**
**డ్రగ్స్ దందాలో నలుగురి అరెస్ట్.. పరారీలో మరో నలుగురు**

**బీబీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి.. డ్రగ్స్ తయారీ, రవాణా చేస్తున్న ముఠా ఆటకట్టించారు. బీబీనగర్ పోలీసులు, ఎస్‌వోటీ బృందాలు సంయుక్తంగా చేపట్టిన ఈ దాడిలో రూ.54 కోట్ల విలువైన 27 కిలోల మెఫిడ్రిన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్‌యాదవ్ ఆదివారం బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. శనివారం కొండమడుగు గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా.. శివధర్మకాంట సమీపంలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఎమ్‌హెచ్ 49 సీడబ్ల్యూ 1313 నంబరుగల కారు అనుమానాస్పదంగా కనిపించింది. వెంటనే వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 27 కిలోల మెఫిడ్రిన్, సుమారు 40 కిలోల అసిటోన్ లిక్విడ్ లభించింది. వాటిని స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్‌కు చెందిన చేతన్ మధుకర్ మెశ్రామ్, అస్సాంకు చెందిన ముజామల్ హక్ కలిసి డ్రగ్స్ దందా ప్రారంభించారు. అస్సాంలో ల్యాబ్ ఏర్పాటు చేసిన ఎండీ అయూబ్ అలీ సహకారంతో డ్రగ్స్ ముడిపదార్థాలు సమీకరించేవారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ, మేడిపల్లికి చెందిన వేటుకూరి రామరాజుకు చెందిన వేటుకూరి ల్యాబ్‌లో హైదరాబాద్ చందానగర్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తి (వేటుకూరి ల్యాబ్స్ ఇన్‌ఛార్జి)తో కలిసి డ్రగ్స్ తయారు చేసి, నాగ్‌పూర్‌కు చెందిన ఆకాశ్ అశోక్ గవాండేతో మహారాష్ట్ర, నాగ్‌పూర్‌లకు తరలిస్తుండేవారు. అక్కడ చందా ప్రదీప్ ఠాకూర్, గోపాల్ సిర్పుట్ పటేలియా డ్రగ్స్ వ్యాపారం చేసేవారు. పోలీసుల దాడిలో చేతన్ మధుకర్ మెశ్రామ్, ముజామల్‌హక్, ఉపద్రష్ట రమణమూర్తి, ఆకాశ్ అశోక్ గవాండేలు పట్టుబడగా.. మిగతావారు పరారీలో ఉన్నారు.

## వైకాపా నేత చింతాడ రవికి రిమాండ్

**21 వరకు విధించిన శ్రీకాకుళం జిల్లా కోర్టు**



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళా ఎస్సై ప్రవల్లికపై దాడి కేసులో ఆమదాలవలస వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్‌కు రిమాండ్ విధించారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఫస్ట్‌క్లాస్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అనురాగ్ ఎదుట పోలీసులు చింతాడ రవితోపాటు మరో నలుగురు నిందితులను హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 21 వరకు నిందితులకు రిమాండ్ విధించారు. అంతకుముందే వీరికి పాతపట్నం సామాజిక ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయడంతో నేరుగా గార మండలంలోని అంపోలు జిల్లా కారాగారానికి తరలించారు. ఈ కేసులో మొత్తం 28 మంది నిందితులు ఉండగా ఇప్పటివరకు 14 మందికి రిమాండ్ విధించారు. మరో 14 మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. ఈ కేసులో చింతాడ రవికుమార్‌తో పాటు మరో ఇద్దరు నిందితులను మహిళా ఎస్సైలు ఎం.ప్రవల్లిక, బి.హైమావతి, కొందరు మహిళా కానిస్టేబుళ్లు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి జిల్లా కోర్టు వరకు 300 మీటర్ల దూరం రోడ్డుపై నడిపించారు. వాహనం మొరాయించడంతో నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు.

## రూ.500 విషయంలో తగాదా

**యజమాని దాడి చేయడంతో అవమానం భరించలేక డ్రైవర్ ఆత్మహత్య**



**జగిత్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** డబ్బు విషయంలో తలెత్తిన తగాదా..చివరకు ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడేలా చేసింది. ఈ ఘటన జగిత్యాల జిల్లా వెల్దుర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఉమాసాగర్, గ్రామస్థుల కథనం మేరకు.. జగిత్యాల గ్రామీణ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డం గంగారెడ్డి అనే వ్యక్తి వద్ద వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రమేశ్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. రమేశ్‌కు గంగారెడ్డి రూ.500 ఇవ్వాల్సి ఉండగా..ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో రమేశ్ శనివారం గంగారెడ్డికి ఫోన్ చేసి దూషించారు. దీంతో గంగారెడ్డి ఆదివారం ఉదయం మరొకవ్యక్తితో కలిసి రమేశ్ ఇంటికి వచ్చి భార్య, పిల్లల ముందే అతడిపై తీవ్రంగా దాడి చేశారు. దీంతో రమేశ్ కళ్లు తిరిగి పడిపోగా గంగారెడ్డి బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకొచ్చారు. జరిగిన ఘటనను అవమానంగా భావించిన రమేశ్ కాసేపటికి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు రమేశ్ మృతదేహానికి పంచనామ నిర్వహించారు. అనంతరం గంగారెడ్డితోపాటు మరొకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కానుగ ఆకులతో క్యాన్సర్‌కు చెక్..!

**నిపుణులు చెప్తున్న అద్భుత ఔషధ గుణాలు తెలిస్తే..**




మన చుట్టూ ఉండే అనేక రకాల చెట్టు, మొక్కల్లో ఎన్నో ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. వాటలో ముఖ్యమైనది కానుగ చెట్టు, గ్రామీణ ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే ఈ కానుగ చెట్టు ఆకులు క్యాన్సర్ వ్యాధి నివారణలోనూ, శరీరానికి వ్యాధి నిరోధక శక్తిని అందించడంలోనూ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తాయని ఆయుర్వేద నిపుణులు స్పష్టం చేస్తున్నారు.


### కానుగ ఆకుల్లోని శక్తివంతమైన సమ్మేళనాలు



వృక్షశాస్త్ర పరిశోధనల ప్రకారం కానుగ ఆకులలో పవర్ ఫుల్ యాంటిఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, ఫ్యూరానోఫ్లేవనాయిడ్లు, ఆల్కలాయిడ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఉచిత రాడికల్స్ నుంచి కణాలను కాపాడి, కణాల ఉత్పరివర్తనాన్ని అడ్డుకోవడంలో సహాయపడతాయి. దీనివల్ల వివిధ రకాల క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా నిరోధించవచ్చు.

యాంటి ఆక్సిడెంట్లు | ఫ్లేవనాయిడ్లు | ఫ్యూరానో ఫ్లేవనాయిడ్లు | ఆల్కలాయిడ్లు

### క్యాన్సర్ కణాల అదుపునకు ఎలా తోడ్పడుతుంది?



- కానుగ ఆకుల సారాన్ని క్రమం తప్పకుండా సరైన మోతాదులో తీసుకోవడం వల్ల శరీరంలో ఆంకోజెనిక్ ఏజెంట్ల ప్రభావం తగ్గుతుంది.
- ఇది శరీరంలో టాక్సిన్లను బయటకు పంపి రక్తాన్ని శుద్ధి చేయడం ద్వారా ఇమ్యూనిటీని పెంచుతుంది.
- రక్త శుద్ధి వల్ల కణాలకు ఆక్సిజన్, పోషకాలు మెరుగుగా అందుతాయి.
- రోగనిరోధక వ్యవస్థ బలపడటంతో వ్యాధి కణాలతో పోరాడే శక్తి శరీరానికి లభిస్తుంది.

### క్యాన్సర్ నిరోధక గుణాలతో పాటు కానుగ ఆకులు మరికొన్ని ఆరోగ్య సమస్యలకు అద్భుతమైన నివారణ

**చర్మ సమస్యలకు మంచి పరిష్కారం**

గజ్జి, చిరమ, సోరియాసిస్ వంటి చర్మ సమస్యలను కానుగ ఆకుల పేస్ట్ తగ్గించడంలో ఎంతో ఉపయోగపడుతుంది.




**నొప్పులు, వాపులకు ఉపశమనం**

కీళ్ల నొప్పులు, వాపులు ఉన్న చోట కానుగ ఆకుల కషాయం లేదా నూనె రాస్తే మంచి ఉపశమనం లభిస్తుంది.



**రక్తంలో చక్కెర నియంత్రణ**

ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణ స్థితిలో ఉంచేందుకు తోడ్పడతాయి.



### వినియోగించే విధానం, జాగ్రత్తలు

- కానుగ ఆకులను కషాయంగా లేదా రసంగా చేసుకుని తీసుకోవచ్చు.
- అయితే, ఇది చాలా ప్రభావవంతమైన మూలిక కాబట్టి, క్యాన్సర్ లేదా ఇతర దీర్ఘకాలిక సమస్యల నివారణకు దీనిని ఉపయోగించే ముందు **అర్హత కలిగిన ఆయుర్వేద వైద్యుల సలహాలు, మోతాదు నియమాలు తప్పనిసరిగా పాటించాలి.**



"ప్రకృతి వైద్యం ప్రతి ఇంటి వైద్యం"

కానుగ చెట్టు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం.

ప్రకృతిని కాపాడండి.. ఆరోగ్యంతో జీవించండి!

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు

మంగళవారం, 11 ఆగస్టు, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com







## వాకలాపూడిలో పోలీసుల దాడి

# సర్కారు ఉద్యోగినిపై 'వ్యభిచార గృహం' కేసు!

### రోడ్లు-భవనాల శాఖ కనిష్ట సహాయకురాలి అరెస్టు




- తెలంగాణ మహిళను రెస్క్యూ చేసిన పోలీసులు..
- సహనిందితుడితో పాటు ఉద్యోగిని అరెస్టు
- ముగ్గురు విటులు పట్టివేత
- మహిళలను సమకూర్చిన మూడో నిందితుడు పరారీ
- మూడు సెల్‌ఫోన్లు, రూ.1,000 నగదు, ఇతర వస్తువుల స్వాధీనం

**కాకినాడ, ఆగస్టు 10,విశ్వం వాయిస్ బ్యూరో న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగంలో కొనసాగుతున్న ఓ మహిళపై వ్యభిచార గృహం నిర్వహణకు సంబంధించిన కేసు నమోదు కావడం కాకినాడ జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసింది. కాకినాడ రూరల్ మండలం వాకలాపూడి పరిధిలోని ఓ అద్దె ఇంటిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సర్పవరం పోలీసులు ఆగస్టు 1న చేపట్టిన దాడిలో రోడ్లు, భవనాల శాఖలో కనిష్ఠ సహాయకురాలిగా పనిచేస్తున్న రాంభట్ల సాయి లక్ష్మితో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు కేసు వివరాలు పేర్కొంటున్నాయి.

**అద్దె ఇంటిపై పోలీసుల ఆకస్మిక దాడి**

వాకలాపూడి-మధురాపురం పరిధిలోని డోర్ నంబరు 4-67/3లో ఉన్న అద్దె ఇంటిలో కొంతకాలంగా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం సర్పవరం పోలీసులకు అందినట్లు తెలుస్తోంది. దీంతో వృత్త పరిశీలకుడు చాళుమూరి ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆగస్టు 1న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఆ ఇంటిపై ఆకస్మికంగా దాడి చేసినట్లు సమాచారం. దాడి సమయంలో రేపూరు గ్రామానికి చెందిన రాంభట్ల సాయి లక్ష్మి అలియాస్ వేదుల వెంకట నాగ సూర్య నరసాయి (57), జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన లికరణం నాగేంద్రబాబు అలియాస్ వంశీ (25)లిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అందుబాటులో ఉన్న కేసు వివరాలు చెబుతున్నాయి.

**తెలంగాణ మహిళకు విముక్తి**

అదే ఇంటిలో తెలంగాణకు చెందిన 32 ఏళ్ల మహిళను గుర్తించిన పోలీసులు ఆమెను బాధితురాలిగా భావించి రక్షించినట్లు సమాచారం. అక్కడ ఉన్న ముగ్గురు వ్యక్తులను విటులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు కేసు వివరాలు పేర్కొంటున్నాయి. విచారణలో ఒంగోలుకు చెందిన కుంచల అంకమరావు అలియాస్ శ్రీనివాస్ పేరు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మహిళలను సమకూర్చడంలో అతడి పాత్ర ఉందని పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం. అతడు పరారీలో ఉండటంతో ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతున్నట్లు తెలిసింది. దాడి సందర్భంగా మూడు చరవాణులు, రూ.1,000 నగదు, కొన్ని నిరోధక సాధనాల పొట్లాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కేసు వివరాలు చెబుతున్నాయి.

**నేర సంఖ్య 244/2026గా నమోదు**

ఈ వ్యవహారంపై సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో నేర సంఖ్య 244/2026గా కేసు నమోదు చేసినట్లు అందిన సమాచారం. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనలతో పాటు అనైతిక రవాణా నిరోధక చట్టంలోని పలు నిబంధనలను కేసులో పొందుపరిచినట్లు తెలుస్తోంది. భారతీయ న్యాయ సంహితలోని 144వ నిబంధన అక్రమ రవాణాకు గురైన వ్యక్తిని లైంగిక దోపిడీకి వినియోగించడాన్ని నేరంగా పేర్కొంటోంది. అనైతిక రవాణా నిరోధక చట్టం వ్యభిచార గృహ నిర్వహణ, వ్యభిచార ఆదాయంపై జీవించడం, వ్యభిచారం కోసం వ్యక్తులను సమకూర్చడం వంటి చర్యలను శిక్షార్హమైనవిగా పేర్కొంటోంది.

**ప్రభుత్వ ఉద్యోగిని కావడంతో వ్యవహారానికి మరో మలుపు**

పోలీసు కేసులో నిందితురాలిగా పేర్కొన్న సాయి లక్ష్మి కాకినాడలోని రోడ్లు-భవనాల శాఖలో కనిష్ఠ సహాయకురాలిగా పనిచేస్తున్నట్లు తెలియడంతో ఈ వ్యవహారం శాఖాపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. కేసు నమోదైన మరుసటి రోజే, అంటే ఆగస్టు 2న, సర్పవరం వృత్త పరిశీలకుడు చాళుమూరి ప్రకాష్ సంబంధిత రోడ్లు-భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్‌కు లేఖ రాసినట్లు సమాచారం. మొదటి సమాచార నివేదిక ప్రతిని జతచేసి, ప్రభుత్వ సేవా నిబంధనల ప్రకారం తగిన శాఖాపరమైన చర్యలను పరిశీలించాలని అందులో కోరినట్లు తెలుస్తోంది.

**ఎనిమిది రోజులైనా చర్య ఏది?**

పోలీసులు ఆగస్టు 2నే శాఖకు సమాచారం పంపినట్లు పేర్కొంటుండగా, ఆగస్టు 10 నాటికీ సంబంధిత ఉద్యోగినిపై ఏ శాఖాపరమైన చర్య తీసుకున్నారన్న విషయంపై స్పష్టత లేకపోవడం ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. క్రిమినల్ కేసులో పేరు నమోదైన ప్రభుత్వ ఉద్యోగి విషయంలో కేసు స్వభావం, ఆరోపణల తీవ్రత, దర్యాప్తుపై పడే ప్రభావం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారి విధుల నుంచి తాత్కాలికంగా తప్పించే నిర్ణయం తీసుకునే అవకాశం ప్రభుత్వ సేవా నిబంధనల్లో ఉంది. క్రిమినల్ కేసు దర్యాప్తు, విచారణ లేదా న్యాయ విచారణలో ఉన్నప్పుడు నిబంధన 8 కింద చర్య తీసుకునేందుకు సంబంధిత అధికారికి అవకాశం ఉందని అధికారిక నిబంధనలు సూచిస్తున్నాయి. అయితే కేసు నమోదైందన్న కారణం ఒక్కటితోనే సస్పెన్షన్ స్వయంచాలకంగా అమలవుతుందని చెప్పడం సరైంది కాదు. సంబంధిత అధికారి కేసు పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఈ వ్యవహారంలో రోడ్లు, భవనాల శాఖ ఏ నిర్ణయం తీసుకుందన్నది కీలకంగా మారింది.

**ఇంకా విధుల్లోనేనా?**

పోలీసుల నుంచి అధికారిక సమాచారం అందిన తర్వాత శాఖాపరమైన విచారణ ప్రారంభించారా? సంబంధిత ఉద్యోగిని ప్రస్తుతం విధుల్లోనే కొనసాగుతున్నారా? విధుల నుంచి తాత్కాలికంగా తప్పించే అంశాన్ని పరిశీలించారా? పోలీసుల లేఖపై ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయం ఏమిటి? అనే ప్రశ్నలకు రోడ్లు-భవనాల శాఖ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది. ఒకవైపు తీవ్రమైన స్వభావం కలిగిన క్రిమినల్ కేసు దర్యాప్తులో ఉండగా, మరోవైపు ప్రభుత్వ ఉద్యోగిపై శాఖ స్పందన ఎంత వేగంగా ఉందన్న అంశం ప్రజాప్రయోజనానికి సంబంధించినదిగా మారింది. పోలీసుల లేఖ అందిన తర్వాత కూడా నిర్ణయంలో జాప్యం జరిగి ఉంటే, దానికి గల కారణాలను శాఖ వెల్లడించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తుది నిర్ణయం న్యాయస్థానానిదే..**

ఈ కేసులో నమోదైనవన్నీ ప్రస్తుతం ఆరోపణలే. పోలీసుల దర్యాప్తు, అనంతర న్యాయ ప్రక్రియలో సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాతే నిందితులపై దోషిత్వం నిర్ణయించబడుతుంది. న్యాయస్థానం తుది తీర్పు వెలువరించే వరకు కేసులో పేరు నమోదైన వారిని దోషులుగా పేర్కొనడం సరికాదు. అయితే ప్రభుత్వ ఉద్యోగిపై ఇలాంటి తీవ్రమైన కేసు నమోదై, ఆ విషయాన్ని సంబంధిత శాఖకు పోలీసులు తెలియజేసిన తర్వాత శాఖ ఏ చర్య తీసుకుంది? ఎందుకు తీసుకుంది? లేక ఎందుకు తీసుకోలేదు? అన్న అంశాలను ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత మాత్రం సంబంధిత అధికారులపై ఉంది.

## విశాఖ ఉక్కులో ప్రమాదం

### పుషర్‌కారు దగ్ధమై రూ.10 కోట్ల నష్టం




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ ఉక్కులో ఆదివారం తెల్లవారుజామున పుషర్‌కారు దగ్ధమైంది. దీంతో రూ.10 కోట్ల నష్టం వాటిల్లింది. బొగ్గును కోక్‌గా మార్చే ప్రక్రియలో ఈ పుషర్‌కారు కీలకంగా ఉపయోగపడుతుంది. కోకోవెన్ నుంచి ఎగిసిన మంటలతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆ సమయంలో కార్మికులెవరూ అక్కడ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన బొగ్గు ఎండకు ఎండి, వానకు తడిసి నాణ్యత దెబ్బతిందని.. ప్రస్తుతం దాన్ని వినియోగంలోకి తీసుకొచ్చినప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

## కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములపై..!

### గోకవరంలో రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల భూములపై వరుస ఆక్రమణల ఆరోపణలు
### సర్వే చేపట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని గ్రామస్తుల డిమాండ్

**గోకవరం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖలకు చెందిన భూములే కబ్జాదారుల లక్ష్యంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శిస్తున్నారు. ప్రజల ఆరోపణల ప్రకారం, ఇప్పటికే పలుచోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఈ పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి చెందిన విలువైన భూములు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం భవిష్యత్తులో తీవ్ర సమస్యలకు దారితీస్తుందని అభిప్రాయ



పడుతున్నారు. ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుంటున్న వారు ఎవరు? ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అక్రమాలను అడ్డుకునే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. గోకవరంలో ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, అసలు ప్రభుత్వ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, వాటికి హద్దురాళ్లు ఏర్పాటు చేసి, ఆక్రమణలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ భూములపై ఆక్రమణల ఆరోపణలు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే చేపట్టాలని ప్రజల డిమాండ్. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


విశ్వం వాయిస్ / విశ్వం VOICE TV

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS

WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.

# మానవత్వమే మహోన్నత సేవ..

## ఆపదలో ఉన్న వారికి మంత్రి సుభాష్ అండ - ఇద్దరు బాధితులకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేత



**రామచంద్రపురం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు తనవంతు సహాయంగా మొత్తం రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. రామచంద్రపురం పట్టణంలోని 2వ వార్డుకు చెందిన దొమ్మలపాటి నాగలక్ష్మి కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానికే పరిమితమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ ఆమెకు రూ.20,000 విలువైన చెక్కును అందజేశారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకుని, కష్టకాలంలో అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా కొండయ్యపాలెం వెంకన్న బాబు కాలికి ఆపరేషన్ జరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ ఆయనకు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం పొందేందుకు ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ప్రజా సేవ అంటే కేవలం పదవిలో ఉండటం మాత్రమే కాదని, కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. కష్టకాలంలో తమకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సుభాష్ వెంట నియోజకవర్గ పరిశీలకులు మధ్య పద్మావతి, రెండో వార్డ్ ఇన్చార్జి సవరపు సుధీర్, పదంమూర్తి, దొమ్మలపాటి విజయలక్ష్మి రాజశేఖర్, పలివెల జగదీష్ రాజశేఖర్, దొమ్మలపాటి లాలి ప్రసాద్, వార్డు ముఖ్య నాయకులు, కూటమి పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు

# సత్వర న్యాయమే ప్రాధాన్యత

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** బాధితుల సమస్యలను సత్వరం పరిష్కరించి, చట్ట పరిధిలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తేతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వయంగా స్వీకరించారు. బాధితులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 30 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు తక్షణమే పంపించి, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ అక్రమాలపై

# రామచంద్రపురంలో గర్జించిన వైఎస్సార్‌సీపీ

## విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామాకు డిమాండ్

**రామచంద్రపురం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యిలను వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామచంద్రపురంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. "డీఎస్సీ అక్రమాలపై విచారణ జరపాలి - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి" అంటూ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలు, అభ్యర్థుల్లో నెలకొన్న ఆందోళనలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడకూడదని, డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.




విద్యార్థులు, నిరుద్యోగ యువతకు న్యాయం చేయడంలో విఫలమైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని పిల్లి సూర్యప్రకాష్ గారు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రామచంద్రపురం టిడ్కో అపార్ట్‌మెంట్స్ హత్యాయత్నం కేసులో

# ముద్దాయికి ఏడేళ్లన్నర జైలు శిక్ష

**రామచంద్రపురం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం టిడ్కో అపార్ట్‌మెంట్స్‌లో గతంలో జరిగిన హత్యాయత్నం కేసులో ముద్దాయికి ఏడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్షతో పాటు 2,000 రూపాయల జరిమానా విధిస్తూ గౌరవ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి బి.హెచ్.వి.లక్ష్మి కుమారి తీర్పు వెలువరించారు. సమాచారం ప్రకారం, 26.09.2025న రామచంద్రపురం టిడ్కో అపార్ట్‌మెంట్స్‌కు చెందిన కోడూరి సత్యవతిపై, కొత్తూరు టిడ్కో అపార్ట్‌మెంట్స్ నివాసి కొడూరి నాగేశ్వరరావు (44, తండ్రి: సుబ్బారావు) కత్తితో దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనపై రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసి, ఎస్ఐ సత్వరమే స్పందించి తన సిబ్బందితో కలిసి ముద్దాయిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ సమయంలో రామచంద్రపురం సిఐ ఎం. వెంకటనారాయణ పర్యవేక్షణలో, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు కేసు ట్రైల్ నిర్వహించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు సాక్షులను సమర్థవంతంగా కోర్టు ముందు హాజరుపరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సునీల్ కుమార్ బలంగా వాదనలు వినిపించి సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను సమగ్రంగా పరిశీలించిన పిమ్మట, నేరం రుజువు కావడంతో ముద్దాయి కోడూరు నాగేశ్వరరావుకు 7 సంవత్సరాల 6 నెలల సశ్రమ జైలు శిక్ష మరియు రూ. 2,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 30 రోజులు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచి, ముద్దాయికి శిక్ష పడేలా శ్రమించిన రామచంద్రపురం సిఐ, ఎస్ఐ మరియు పోలీసు సిబ్బందిని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

రెండేళ్ల నమ్మకం.. ప్రజల గుండెల్లో

# కూటమి పాలనకు సుస్థిర స్థానం

## అభివృద్ధి పరుగులు.. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి భరోసా

## మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వైసీపీ మాజీ కార్పొరేటర్ తో సహా పలువురు టిడిపి పార్టీలో చేరికలు




**రామచంద్రపురం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం పట్టణంలోని 13వ, 2వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రజలను నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు, పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలనే ఉద్దేశంతోనే గడపగడపకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో రామచంద్రపురాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

**మంత్రి సుభాష్ సమక్షంలో పలువురు టిడిపిలో చేరికలు**

తెలుగుదేశం పార్టీ ఇంటింట ప్రచార కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్ పలివెల సీతామహాలక్ష్మి జగదీష్ దంపతులు రెండో వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు సవరపు సుదీర్ ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ సమక్షంలో పార్టీలో చేరారు. అలాగే రెండో వార్డ్ మరియు కొత్తూరు రోడ్డుకు చెందిన 20 మంది మహిళలు కూడా టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారందరినీ మంత్రి సుభాష్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, కూటమి పార్టీ నాయకులు, స్థానిక వార్డు నాయకులు, క్లస్టర్, కో-క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

'కూటమి'కి

# విఘాతం కలిగించొద్దు : తేల్చేసిన పార్టీలు



నాయకుల కన్నా కూటమికే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తామని.. ఈ విషయంలో నాయకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడి ప్రకటన చేశాయి. ముఖ్యంగా కూటమి ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపాయి. కూటమిపై ప్రభావం పడేలా వ్యవహరించే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని పేర్కొన్నాయి. సమస్యలు వస్తాయని.. వాటిని పరిష్కరించుకునేందుకు సరైన వేదికలను నాయకులు వినియోగించుకోవాలని తేల్చి చెప్పాయి. ఈ విషయంలో పార్టీల అధిష్టానాలు.. నియమించిన సమన్వయ కమిటీలకు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నాయి. తాజాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు రాజకీయాలు దుమారం రేపాయి. జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి, టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రెడ్డికి మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ వ్యవహారంపై ప్రత్యర్థులు సోషల్ మీడియా ద్వారా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అదేవిధంగా కూటమిపైనా ఆరోపణలు చేస్తున్నారు. మరోవైపు ఈ వ్యవహారం స్థానికంగా చర్చకు దారితీసింది. ఈ విషయంపై తాజాగా టీడీపీ, జనసేనలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నాయకుల వ్యవహార శైలి కారణంగా కూటమిపై ప్రభావం పడేలా వ్యవహరించవద్దని పేర్కొన్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీలతో ఇప్పటికే ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీకి ఒంగోలు దుమారం సరిదిద్దే బాధ్యతలను అప్పగించాయి. దీంతో సోమవారం మధ్యాహ్నం జనసేన-టీడీపీ సమన్వయ కమిటీ నాయకులు విజయవాడలో భేటీ అయ్యారు. టీడీపీ నుంచి మంత్రి అచ్చెన్నాయుడు, పార్టీ ఏపీచీఫ్ పల్లా శ్రీనివాసరావు, మరో మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ సహా మరికొందరు నాయకులు హాజరయ్యారు. ఒంగోలు పరిణామాలపై ఆయా పార్టీల నాయకులతో జూమ్ సమావేశంలో నేరుగా తెలుసుకున్నారు. ఎవరైనా సరే.. పార్టీలకు అనుకూలంగా వ్యవహరించాలని.. ముఖ్యంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరించరాదని కూడా ఇరువురు నేతలకు తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా దామచర్లపై బాలినేని మరోసారి ఆరోపణలు గుప్పించారు. అయితే.. ఏదైనా సమస్య ఉంటే సమన్వయ కమిటీతో చర్చించాలని నాయకులు సూచించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇదే సమయంలో సంయమనం పాటించాలని.. ప్రత్యర్థులకు రాజకీయ అస్త్రాలను అందించేలా వ్యవహరించడం సరికాదని తేల్చి చెప్పారు. కూటమి ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

# ఏపీలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పాలసీ విడుదల

**అమరావతి, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పాలసీని ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, ప్రజల సేవలు మెరుగుదల కోసం ఈ పాలసీకి రూపకల్పన చేశారు. 91 పేజీల పాలసీ డాక్యుమెంట్‌లో సమగ్రంగా అన్ని అంశాలను ప్రభుత్వం ప్రస్తావించింది. 51 శాతం కంటే ఎక్కువ ప్రైవేటు వాటా ఉండే ప్రాజెక్టులకు పాలసీలో చోటు కల్పించింది. మొత్తంగా 18 రకాల పద్ధతులను ఇందులో పొందుపర్చింది.




# ఎమ్మెల్యే మేనల్లుడి తీరుపై మత్స్యకారుల ఆగ్రహం

**స్థల వివాదంలో దౌర్జన్యం, కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు**
**జనసేన నాయకుడు చింతకాయల శ్రీను ఆధ్వర్యంలో మహిళలతో ఆందోళన**



**కాకినాడ రూరల్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో స్థల వివాదం నేపథ్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీ మేనల్లుడు తూము కృష్ణ చైతన్య ఏబన్ను, ఆయన అనుచరుల తీరుపై మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కులాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ జనసేన పార్టీ నాయకుడు చింతకాయల శ్రీను ఆధ్వర్యంలో ఆయన స్థలంలో మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చింతకాయల శ్రీను మాట్లాడుతూ తాను జనసేన పార్టీ నాయకుడిగా పనిచేస్తున్నానని, తనకు సంబంధించిన స్థల విషయంలో ఎమ్మెల్యే మేనల్లుడు బన్ను కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయనను కలవలేకపోయామని తెలిపారు. తమ స్థలానికి సంబంధించిన వివాదం కోర్టులో ఉన్నప్పటికీ పోలీసులు జోక్యం చేసుకుని తమ వారిపై లాఠీచార్జ్ చేశారని, ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని శ్రీను ఆరోపించారు. తమపై తప్పుడు కేసులు పెట్టాలని బన్ను పోలీసులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పోలీసులు తమకు చెప్పారని పేర్కొన్నారు. వాకలపూడి పంచాయతీ అధికారులను ఆశ్రయించినప్పుడు రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా ఉన్నాయని, తాము ఏమీ చేయలేమని అధికారులు చెప్పినట్లు శ్రీను తెలిపారు. తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. జనసేన పార్టీ విజయం కోసం ఎటువంటి రాజకీయ లబ్ధిని ఆశించకుండా మత్స్యకారులు పనిచేశారన్నారు. అలాంటి మత్స్యకారుల కులాన్ని కించపరిచేలా ఎమ్మెల్యే మేనల్లుడు మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే పంతం నానాజీ స్పందించి మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నానాజీ తమ ప్రాంతంలో పెద్దగా పర్యటించలేదని, అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదని శ్రీను విమర్శించారు. మత్స్యకారుల సమస్యలను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో రాజకీయంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. స్థల వివాదం, పోలీసుల వ్యవహారం, మత్స్యకారులపై చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

# రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు జన్మదినం సందర్భంగా అన్నదానం



**కాకినాడ రూరల్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ జన్మదినం సందర్భంగా కాకినాడ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మరియు కాకినాడ రూరల్ ఇంచార్జ్ గిసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మా రాష్ట్ర అధ్యక్షులు మరిన్ని పుట్టినరోజులు చేసుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు అలాగే రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బిజెపిని మరింత బలోపేతం చేసే విధంగా రాష్ట్ర అధ్యక్షులు మాధవ్తో కలిసి మరింత కృషి చేస్తానని శ్రీనివాసరావు తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు బిజెపి నాయకులు పైడా భవానిప్రసాద్, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, శ్రీదేవి, దాట్ల వర్మ, కుండల సాయి, తుమ్మలపల్లి నారాయణ, చోడిశెట్టి రమేష్,తుమ్మలపల్లి నాని పెద్ద ఎత్తున బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# వాకలపూడిలో స్థలం వివాదం?

**ఆయిల్ మాఫియా వ్యక్తి ఆక్రమణలకు యత్నం**
**స్థలం యజమాని మేనల్లుడు రెడ్డినాయుడు ఆవేదన..**



**కాకినాడ రూరల్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామానికి చెందిన ఆయిల్ మాఫియాకు చెందిన చింతకాయల శ్రీను అనే వ్యక్తి తమ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకోవడానికి కుట్ర పన్నుతున్నాడని, అతడి ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని స్థల యజమాని మేనల్లుడు రెడ్డినాయుడు తీవ్రంగా ఆరోపించారు.?ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ స్థలాన్ని మేము 2004లోనే కొనుగోలు చేశామని ,అన్ని చట్టబద్ధమైన డాక్యుమెంట్లు మా వద్దే ఉన్నాయన్నారు.జడ్పీటీసీ కిట్టు తమను రమ్మన్నారంటూ వాకలపూడి గ్రామానికి చెందినసారథి, ఎర్రకాశి అనే వ్యక్తులు వచ్చి మమ్మల్ని బెదిరించే ప్రయత్నం చేశారు. డాక్యుమెంట్లు పట్టుకుని రమ్మని మేము చెబితే ఎటువంటి డాక్యుమెంట్లు తేకుండా దౌర్జన్యానికి దిగుతున్నారని అన్నారు.మా వెనుక స్థానిక ఎమ్మెల్యే మేనల్లుడు బన్ను ఉన్నాడని, కూటమి ప్రభుత్వం గెలుపు కోసం పనిచేస్తావని చెబుతూ చింతకాయల శ్రీను అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అవన్నీ పూర్తిగా అవాస్తవాలు. ఎమ్మెల్యే మేనల్లుడి బన్ను తమకు ఇప్పటివరకు కూడా తెలియదని ఇంత రాద్ధాంతం చేసుకున్నాడు కాబట్టి ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యేను కలిసి తనకు న్యాయం చేయాలని కోరుతానని ఈ సందర్భంగా తెలిపారు.చింతకాయల శ్రీను గతంలో ఆయిల్ మాఫియా కేసుల్లో ఉన్నాడని అలాంటి నేర చరిత్ర ఉన్న వ్యక్తి ఇప్పుడు మాకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడు. ఈ అన్యాయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూస్తామని రెడ్డినాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం, పోలీసులు తక్షణమే స్పందించి తమ స్థలాన్ని ఆక్రమించకుండా రక్షణ కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

# ప్రభుత్వం హామీనీ అమలు చేసి సత్వర న్యాయం చేయండి

**పిజిఆర్ఎస్‌లో వేట్లపాలెం ఫైర్ యాక్సిడెంట్ బాధితురాలు**



**కాకినాడ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** సామర్లకోట మండలం, వేట్లపాలెం గ్రామంలో ఫిబ్రవరి 28న జరిగిన బాణాసంచా పేలుడు సంఘటనలో మృతి చెందిన గోడత మహేష్ బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని కోరుతూ ఆయన భార్య గోడత శ్యామల కాకినాడ కలెక్టరేట్ ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్ ను ఆశ్రయించారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఎటువంటి ఆధారం లేకుండా ఉన్నానని, ప్రభుత్వం నివేశనా స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించానన్నారు.బాణాసంచా ప్రమాదం జరిగి సుమారు 7నెలలు గడుస్తున్నా తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని వాపోయారు. తన కుమార్తె జీవనాధారం కోల్పోయి ఒంటరిగా జీవనం సాగిస్తోందని, వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న అధికారులు ఇప్పటికీ కనికరించలేదనీ బాధితురాలి తల్లి ఉండ్రాసు జీవరత్నం కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ యజమానిని కోల్పోయి సొంత ఇల్లు సరైన జీవనోపాధి లేక పిల్లలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తనకు ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని, అలాగే వితంతు పింఛను ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

**డీఎస్సీలో జరిగిన అక్రమాలపై**

# సిబిఐ ఎంక్వైరీ జరగాల్సిందే..

**మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్**



**కాకినాడ రూరల్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీసీ ఎంక్వైరీ కాదు సీబీఐ ఎంక్వైరీ కావాలని, ఈ అక్రమాలకు కారకుడైన విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేసి తీరాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని మరియు ఎలక్షన్ ప్రసారంలో చేసిన హామీ నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని మాజీ మంత్రి వైయస్ఆర్సీపీ నాయకులు కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. తదానంతరం తూరంగి వద్ద ఉన్న డిమార్ట్ వద్ద నుండి కరప గ్రామంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకు ఏర్పాటు వైయస్సార్ నాయకులు మరియు కార్యకర్తలతో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.


**స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను**

# పోలీస్ పెరేడ్ గ్రౌండ్ నందు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



**కాకినాడ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సంయుక్తంగా పరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా వేడుకలకు సంబంధించి సభావేదిక, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాయుధ దళాల కవాతు (పరేడ్) ప్రదర్శన తీరుతెనులను పరిశీలించి.. వేడుకల ఏర్పాట్ల కు సంబంధించి రెవెన్యూ,పోలీస్ ఇతర శాఖల అధికారులను అడిగి వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 15న జిల్లా స్థాయిలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యం లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అలాగే వేడుకలను తిలకించడానికి విచ్చేసే సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా షామియానా, తాగునీరు, సిట్టింగ్ అరేంజ్మెంట్ వంటి అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ,అధనపు ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ రెవెన్యూ అధికారి ఎస్.మల్లిబాబు, ఎస్బీ డీఎస్పీ ఎస్. సత్య నారాయణ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులం.. రక్షణ కల్పించండి..




**కాకినాడ రూరల్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రూరల్ మండలం కొవ్వూరు లోని వారాహి దేవస్థానంలో ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్న తమపై ప్రైవేట్ వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నారంటూ ఆలయ ఈవో సిహెచ్ ఎస్ఎంఎస్ శ్రీనివాస్, డిప్యూటేషన్ ఉద్యోగి కుసుమంచి రఘుబాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైకోర్టు ఆదేశాలు, తమ శాఖ నిబంధనలు ప్రకారం తాము పని చేస్తున్నామని వారు తెలిపారు. రెండురోజులుగా ప్రైవేట్ వ్యక్తి తమ మనుషులతో దౌర్జన్యంగా వచ్చి ఆలయంలో చీరలు, ఇతర వస్తువులు ఎత్తుకుపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గత శుక్రవారం విధి నిర్వహణలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ పై ప్రైవేట్ వ్యక్తి మనిషి దౌర్జన్యం చేసి గెంటివేయడమే గాక ఉప్పుటేరులో పడేసి చంపేస్తానని హెచ్చరించారని వారు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ మేరకు లిఖితపూర్వకంగా ఇంద్రపాలెం ఎస్ ఐ వీరబాబుకు ఫిర్యాదు అందజేశారు. గతంలోనే ప్రైవేట్ వ్యక్తులపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పెట్టడం జరిగిందని, ప్రస్తుతం ఫిర్యాదు పరిగణలోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్ ఐ. వెల్లడించారు.

# పారదర్శక పాలనే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రచార కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజాస్వామ్య బద్ధంగా పారదర్శక పాలన అందించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయంగా సాగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్థానిక 13 వ డివిజన్ సంజయ్ నగర్ నందు పర్యటించి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అందించిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ప్రజలకు వివరించి కరపత్రలను అందజేశారు. అనంతరం డైరీ ఫారం సెంటర్ నందు ఉన్న అన్న క్యాంటీన్ విజిట్ చేసారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత పాలకులు దిక్కుముక్కు లేని విధ్వంసకర రాష్ట్రంగా అధిగతి పాల్జేసిన రాష్ట్రాన్ని నేడు దేశం గర్వించేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని, ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పెంచి, స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, 269 అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి రూ.5/-లకే భోజనం అందిస్తున్న చరిత్ర కూటమి ప్రభుత్వానిదన్నారు. గృహిణులకు సంవత్సరానికి దీపం పథకం ద్వారా 3 గ్యాస్ సిలిండర్‌లు రాయితీలపై అందించడం జరుగుతుంది, కుటుంబంలో అందరి పిల్లలకు తల్లికి వందనం పూర్తి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, శెట్టిబలజీ కార్పొరేషన్ డైరెక్టర్ ఒమ్మి బాలాజీ, డివిజన్ ఇంచార్జ్ గాది శివరామ కృష్ణ, క్లస్టర్ చింతలపూడి రవి, తాజుద్దీన్, కలకా సువర్ణ, జొన్న వెంకన్న, భాష, నిమ్మగడ్డ జగదీష్, జారుల్లాఖాన్, భద్రరావు, అల్లంరాజు, ఎలిపే శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన

# బైక్ ర్యాలీ పోలీస్ ఎంట్రీతో బ్రేక్

తోట ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి జనసంద్రం పాదయాత్రతో విగ్రహాల సెంటర్ వరకు..
నియోజకవర్గ నలుమూలల నుంచి పాల్గొన్న వందలాది మంది నాయకులు కార్యకర్తలు
ప్రజా గొంతులను నొక్కాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం
నిరసనలకు దీక్షలకు కూటమి ప్రభుత్వం ఎందుకు భయపడుతుంది : ఎమ్మెల్సీ తోట





**మండపేట టౌన్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజల గొంతు నొక్కాలని అధికారపక్షం చూస్తుందని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. వైసిపి ఆందోళనల నేపథ్యంలో మండపేట పట్టణంలో సోమవారం ఉదయం నుంచి హై టెన్షన్ నెలకొంది. ఈ నేపథ్యంలో రాత్రి నుంచి వేరే చోట ఉన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉదయం 10:30 కు విజయలక్ష్మి నగర్లోని వైసీపీ కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. అప్పటికే నియోజకవర్గ నలుమూలల నుంచి వందలాది మంది కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి నడుచుకుంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కరాచీ సెంటర్ విగ్రహాల వద్దకు చేరుకున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. రూరల్ ఎస్సై కిషోర్ నేతృత్వంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మీడియా తో మాట్లాడుతూ ప్రతిపక్షం గొంతు నొక్కాలని చూస్తే ఫలితాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం దౌర్భాగ్య పరిస్థితిని వివరించారు. నిరాహార దీక్షలు ర్యాలీలు ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వ పెద్దలు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ఇక్కడ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాదని లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకుంటుంటే ఇక్కడ మాత్రం రెడ్ బుక్కు అంటూ దౌర్జన్యాలకు తావిస్తూ రాక్షస పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. బెదిరించే తత్వంతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. వేలెత్తి చూపే నేతలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి దుర్మార్గపు పాలన గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. జగన్ పోరాట పటిమ చూసి టిడిపి నేతలు వణుకుతున్నారనీ పేర్కొన్నారు. జగన్ పిలుపు ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున తరలివస్తున్నారన్నారు. జగన్ అంటే ఎందుకు భయపడుతున్నారని జగన్ పేరు చెబితే కూటమికి దడ పుడుతుందని ఎద్దేవా చేశారు. వారికి నిద్ర పట్టడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో అమలు కాని హామీలు ఎన్నో ఇచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. రైతులకు ప్రతి ఏడాది రూ 20,000 ఇస్తామన్నారు. దానికి దిక్కు లేదని పేర్కొన్నారు. 50 ఏళ్ళు నిండిన వారికి పెన్షన్లు ఇస్తామన్నారని అది కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. నీకు 15 నీకు 15 అంటూ ప్రచారం చేశారు తప్పితే అమలు మాత్రం చేయలేదని విమర్శించారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ 3000 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తామని ఈ ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ మూడేళ్లలో రూ9 వేల కోట్ల రూపాయలు కార్పొరేషన్ కు ఇవ్వాల్సి ఉందన్నారు. తొమ్మిది రూపాయలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. అమరావతిపై పడి దోచుకోవడం తప్పితే ప్రజలకు ఉపయోగపడే ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందని హెచ్చరించారు. శాంతి యుతంగా తాము ర్యాలీ నిర్వహించి తమ నిరసన తెలిపామని పేర్కొన్నారు. తమ ముఖ్య నేతలందరినీ గృహ నిర్బంధం చేశారని పేర్కొన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు కల్పించినా వేల మంది తరలివచ్చిన విధానం ఈ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత తెలియజేస్తుందని చెప్పారు. తరలివచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, మండపేట నియోజకవర్గ పరిశీలకులు ఒంటెద్దు వెంకన్న నాయుడు, మాజీ చైర్మన్ పతివాడ నూక దుర్గా రాణి, అధిక సంఖ్యలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సీతానగరం పిహెచ్‌సీలో

# పిఎం శ్వాత్య మాతృత్వ అభియాన్



**సీతానగరం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు ప్రధాన మంత్రి శ్వాత్య మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎం) కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.శైలజ రాణి ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించబడినది. ఈ శిబిరానికి గర్భిణీ స్త్రీలు 45 మందికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి తగిన మందులు ఉచితముగా ఇచ్చారు. వీరిలో 12 మందిని హై రిస్క్ గర్భిణీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ రాణి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ క్రమం తప్పకుండా నెలకు ఒకసారి డాక్టర్ తో పరీక్షలు చేయించు కొని తగిన పౌష్టిక ఆహారం తీసుకుంటూ మనసు ప్రశాంతంగా ఉంచుకొని విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు నిర్దేశించారు. మందులు సమయానికి తీసుకోవాలని, ద్రవపదార్థాలు తరచుగా తీసుకోవాలని తద్వారా తల్లి మరియు తల్లి కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓవై ఎస్.రాయుడు, పిహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, జి.దైవ కృప, స్టాఫ్ నర్సులు కిరణ్మయి, ఎల్‌టి శిల్ప, ఫార్మాసిస్ట్ నగేష్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి ఓపి సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ టైక్వాండోలో స్వర్ణంతో

# మెరిసిన ఎంపీఎస్ విద్యార్థి షేక్ కరీమా

అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో మండపేట పబ్లిక్ స్కూల్ విద్యార్థి సత్తా చాటారు. హైదరాబాద్ చంపాపేటలోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల నిర్వహించిన అంత ర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ టైక్వాండో పోటీల్లో మండపేటకు చెందిన షేక్ జహంగీర్ కుమార్తె అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. మండపేట మదర్ తెరిసా స్పోర్ట్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ సి.హెచ్. హరీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనియర్ బాలికల ఫైటింగ్ 'ఏ' విభాగంలో ఎంపీఎస్ స్కూల్ కి చెందిన షేక్ కరీమా స్వర్ణ పతకం సాధించి విజేతగా నిలిచారు.విద్యార్థిని షేక్ కరీమా విజయంపై రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అభినందనలు తెలిపారు. క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ పోటీల్లో నేపాల్, శ్రీలంక వంటి దేశాల నుండి క్రీడాకారులు పాల్గొన్నప్పటికీ మండపేట విద్యార్థులు సత్తా చూపి పట్టణం పేరు అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడం గర్వ కారణమని పేర్కొన్నారు. గ్రాండ్ మాస్టర్ తాతపూడి అబ్బులు, ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు లు విద్యార్థులను, కోచ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీం, కరీమా తల్లిదండ్రులు పాల్గొన్నారు. కరిమా తండ్రి స్థానిక కలువపువ్వు సెంటర్ లోని జనరిక్ మెడికల్ స్టోర్స్‌లో పనిచేస్తున్నారు.

# ఎపి రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా యేసుపాదం



**సీతానగరం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్గా సీతానగరం మండలానికి చెందిన మద్దాల యేసు పాదం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద ఏసు పాదం మాట్లాడుతూ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.

కేశవరంలో పిఎంపిల ఆధ్వర్యంలో

# ఉచిత మెగా వైద్య శిబిరం



**మండపేట మండలం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ పెదపాటి విష్ణు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేశవరం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ - పియంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, మండపేట రూరల్ పియంపి మండల సంయుక్త కార్యదర్శి, ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సమితి అధ్యక్షులు, వారాహి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ అధినేత డాక్టర్ పెదపాటి విష్ణు ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది.ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్, కూసువారి రామాలయం వద్ద ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ శిబిరానికి రాజమండ్రి విజయ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ నుండి డాక్టర్ టీవీ రామారెడ్డి, డాక్టర్ జీవి ధనుంజయ రెడ్డి, డాక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సుధా మల్లిడి హాజరై ప్రత్యేక వైద్య సేవలు అందించారు. రాజమండ్రి శారదా డెంటల్ క్లినిక్ నుండి డాక్టర్ కంటిపూడి తేజ, డాక్టర్ సంహిత్ వర్మ దంత పరీక్షలు నిర్వహించారు. శివ సత్య లేబరేటరీ సహకారంతో ఉచిత బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు.ఈ శిబిరంలో షుగర్, రక్తపోటు, ఆర్థోపెడిక్, జనరల్, గైనక్, గుండె-ఊపిరితిత్తుల పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఉచిత ఈసిజి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 500 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పియంపి అధ్యక్షులు కోన సత్యనారాయణ, గ్రామ టిడిపి నాయకులు కంటిపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ ఉండమట్ల వాసు, ఉండమట్ల తాతాజీ, జనసేన అధ్యక్షులు ఉండమట్ల శ్రీనివాస్, ఎంపీటీసీ అన్నందేవుల కృష్ణారావు, కంటిపూడి రాంబాబు, కుప్పిరెడ్డి ప్రసాద్, పియంపిలు ఇరవాడ రవి కుమార్, శివాజీ, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొని పెదపాటి విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలు అందించిన విష్ణును అభినందించారు.

ప్రియదర్శిని విషయంలో స్పందించిన

# ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు కృతజ్ఞతలు : కోడి మోజెస్ బాబు



**సీతానగరం, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రఘుదేవ పురం గ్రామానికి చెందిన ఏడిద అబ్బులు,నాగమ్మ కుమారు డు దొరబాబు యొక్క భార్య పిల్లల విషయంలో జరిగిన అన్యాయం విషయంలో ప్రభుదేవా పురం జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించడానికి మీడియా ద్వారా సమాచారం తెలియపరచడం జరిగింది.భర్త దొరబాబు చనిపోయిన తర్వాత ఆమెకు నిలువ నీడ లేకుండా ఇంటిని,స్థలాన్ని, పొలాన్ని అక్రమంగా తీసుకోవడం జరిగిందని, ఈ గ్రామంలో పెద్దల దగ్గరకు గ్రామ స్తుల దగ్గరికి వెళ్లి భిక్షాటన చేసిన సందర్భం అందరికీ తెలుసు. ఇదే విషయాన్ని నియోజకవర్గ శాసన సభ్యులు బత్తుల బలరామ కృష్ణకు ప్రియదర్శినికి జరిగిన అన్యాయాన్ని తెలియచేయడం జరిగింది. అంతకు ముందు ఇరుపక్షాల వారిని పిలిచి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి కాబట్టి వారు వెంటనే స్పందించి ప్రత్యేకంగా మాట్లాడి పది రోజుల్లో అనగా వచ్చే ఆదివారం లోపుననే సమస్యకు పరిష్కారం చూపిస్తానని మాట ఇవ్వడం,న్యాయసమ్మతంగా ఎలా జరిగించాలో నేను మాట్లాడతానని శాసనస భ్యులు హామీ ఇచ్చారని వారికి నా హృదయపూ ర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని శాసనసభ్యులు న్యాయం చేస్తానని వారిచ్చిన మాట చెప్పిన వారి మీద నమ్ముకుంటూ శాంతియుత నిరాహార దీక్షను విరమించడం జరిగిందని కోడి మోజెస్ బాబు అన్నారు. మొదటిగా అంబేద్కర్,జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు,దైవ సేవకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మండపేట విద్యార్థిని ఎంపిక



**మండపేట టౌన్, ఆగస్టు 10, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని జిల్లెళ్ళ వినీల ప్రియదర్శిని ఎంపికైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు వివరాలు తెలిపారు.రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి రన్నింగ్ పోటీలో వినీల ప్రియదర్శిని ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు.ఈనెల 29వ తేదీన తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ రన్నింగ్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు డాక్టర్ నెహ్రూ నాయక్, ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు వినీల ప్రియదర్శిని అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.




# 5 సినిమాలు చేస్తే ఒకే ఒక్క హిట్..



సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది అందాల భామలు కొన్ని సినిమాలేక పరిమితం అవుతున్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది భామలు నాలుగు ఐదు సినిమాలు చేసి అతర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సినిమాలు మానేసి పెళ్లి చేసుకొని సెటిల్ అవుతున్నారు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో యంగ్ బ్యూటీల హడావిడి ఎక్కువైంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ జోరు మీదున్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకేఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోతున్నారు. సినిమా సినిమాకు కొత్త కొత్త హీరోయిన్స్ తెరపై సందడి చేస్తున్నారు. అయితే మరికొంతమంది ముద్దుగుమ్మలు మాత్రం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసిన హిట్లు మాత్రం అందుకోలేకపోతున్నారు. సినిమాల రిజల్ట్ తో సంబంధాలు లేకుండా వరుసగా ఛాన్స్ లు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఈ అమ్మడు కూడా అంతే .. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చింది ఈ చిన్నది. తెలుగులో వరుసగా ఆఫర్స్ అందుకుంది. సినిమాలు హిట్స్ అవ్వకపోవడంతో గ్లామర్ గేట్లు ఎత్తేసింది. తన అందాలతో ప్రేక్షకులను కవ్వించినా.. తెలుగులో ఆరు సినిమాలు చేసింది కానీ ఒకే ఒక్క సినిమా హిట్ అయ్యింది. అయినా కూడా ఈ చిన్నదానికి క్రేజ్ తగ్గలేదు. ఇప్పుడు రెండు పాన్ ఇండియా సినిమాలు చేసింది.. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె అందానికి ఫిదా అవ్వని కుర్రాడు ఉండడు. అందంలో అప్సరస ఆమె.. నటనలోనూ ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులో సాలిడ్ హిట్ కోసం ఇప్పుడు ఎదురుచూస్తుంది ఈ మ్మాడు. తక్కువ సమయంలోనే స్టార్ గా మారింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఆమె మరెవరో కాదు టాలీవుడ్ హాట్ బ్యూటీ నిధి అగర్వాల్. టైగర్ ష్రాఫ్ నటించిన మున్నా మైఖేల్ సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అతర్వాత తెలుగులో సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. మిస్టర్ మజ్ను, అతర్వాత ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. కానీ ఈ సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. సవ్యసాచి, మిస్టర్ మజ్ను, ఇస్మార్ట్ శంకర్, హీరోలు సినిమాలు చేసింది.

సినిమా చూస్తున్నంతసేపు కళ్లల్లో నీళ్లు వచ్చాయి,

# మనసు బరువెక్కింది : నాగార్జున



'పళ్ళ బురుసు' సినిమా చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నాను. అదే సమయంలో కళ్లల్లో నీళ్లు వచ్చాయి, మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా ఉందని ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున అన్నారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది, 'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది, 'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ: అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్నగారు ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. నాన్నగారు సినిమాలు చేసిన రోజుల్లో డిస్ట్రిబ్యూషన్ ఎలా ఉండేదో, ఆ పద్ధతిని మళ్లీ తీసుకురావడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నాం. ఇటీవలే డిస్ట్రిబ్యూషన్‌ను ప్రారంభించాం. అది చాలా విజయవంతంగా సాగుతోందని అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఎన్నో మంచి సినిమాలు చేశాం. ఇకపై మరింత వేగంగా, మరింత బలంగా సినిమాలు చేయాలని, మరింతమంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే ఈ సినిమాలను ప్రారంభించాం అన్నారు నాగార్జున. మొన్ననే 'లెనిన్'ను రిలీజ్ చేశాం. ఇప్పుడు 'పళ్ళ బురుసు'ను విడుదల చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. ఆ తర్వాత మరో రెండు సినిమాలు కూడా ఉన్నాయి. వీటితో పాటు నా 'కింగ్ 100' కూడా రాబోతోంది. ఇకపై అన్నపూర్ణ స్టూడియోస్ చాలా బిజీగా ఉంటుంది. ఇకపై మరింత జోరుగా సినిమాలు చేయబోతున్నాం.. 'పళ్ళ బురుసు' సినిమా గురించి చెప్పాలంటే.. తల్లిదండ్రులను చూసుకోవడం కంటే అదృష్టం మరొకటి ఉండదు. నా తల్లిదండ్రులను నేను చూసుకున్నాను. వాళ్లు నన్ను చిన్నప్పుడు చూసుకున్నారు. మనకు చిన్నప్పుడు ఏ భయం వచ్చినా తల్లిదండ్రుల చేయి పట్టుకుంటాం. మనం పెద్దయ్యాక వాళ్ల బాధ్యతను తీసుకోవాలి. ఎవరైనా సరే తల్లిదండ్రులకు సేవ చేయాలి. అమల తన పేరెంట్స్ ని అద్భుతంగా చూసుకుంటుంది. తనతో ఎప్పుడూ చెబుతుంటాను.. తనకంటే అదృష్టవంతురాలు ఎవరూ లేరని. తల్లిదండ్రులను చూసుకోవడం చాలా ముఖ్యం అన్నారు నాగ్. ఉదయ్ నాకు కథ చెప్పినప్పుడు ఇదే విషయం నాకు గుర్తుకు వచ్చింది. ఈ కథను అతను చాలా ఎంటర్టైనింగ్‌గా చెప్పాడు. సుధాకర్ రెడ్డి గారు, శంభూతాత పాత్రలో అద్భుతంగా చేశారు. మురళీధర్ గౌడ్ గారి నటన కూడా చాలా బాగుంది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ చక్కని నటన కనబరిచారు. చాలా మంచి టీమ్‌వర్క్‌తో చేసిన సినిమా ఇది. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. పవన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. 'లవ్ స్టోరీ' మ్యూజిక్‌ను నేను ఇప్పటికీ వింటూ ఉంటాను. ఈ సినిమాకు కూడా ఆయన చాలా అద్భుతమైన సంగీతాన్ని అందించారు. నేను సినిమా చూశాను. చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంది. సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నాను. అదే సమయంలో కళ్లల్లో నీళ్లు వచ్చాయి, మనసు బరువెక్కింది. ఈ సినిమా చేసినందుకు మాకు చాలా తృప్తిగా ఉంది. అందరూ ప్రేమించి తీసిన సినిమా ఇది. ఖచ్చితంగా విజయం సాధిస్తుంది. కొత్త కథతో ఎవరైనా వస్తే అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించడానికి సిద్ధంగా ఉంది. మా టీమ్‌కు కథ నచ్చితే, నేను తప్పకుండా కథ వింటాను. అన్నపూర్ణ కాలేజీకి గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు వచ్చినప్పుడు తెలంగాణ కల్చర్‌పై ఎందుకు ఒక సినిమా తీయకూడదని అడిగారు. పళ్ళ బురుసు నేపథ్యానికి సంబంధించిన చక్కని కథ. ఆగస్టు 14 మా అమ్మగారి పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ సినిమాపై ఉంటాయని నాకు నమ్మకం ఉంది అని నాగార్జున అన్నారు.

క్రీడా వాయిస్

అప్పుడు భారత ఆటగాళ్లను

# సంగక్కర దూషించాడు

మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్



శ్రీలంక క్రికెట్ దిగ్గజం కుమార సంగక్కరతో 2005లో జరిగిన మాటల యుద్ధాన్ని టీమ్ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తాజాగా గుర్తు చేసుకున్నాడు. ముందుగా అతనే తిట్టడం మొదలుపెట్టాడని, తాను కూడా తిరిగి గట్టిగా బదులిచ్చానని పేర్కొన్నాడు. అసలు ఏం జరిగిందంటే.. 2005లో శ్రీలంక జట్టు భారత పర్యటనకు వచ్చింది. ఢిల్లీలో జరిగిన రెండో టెస్టులో భారత్ 188 పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా.. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ అనుహ్య నిర్ణయం తీసుకుంది. గౌతమ్ గంభీర్‌కు తోడుగా ఇర్ఫాన్ పఠాన్‌ను ఓపెనర్‌గా పంపి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. గంభీర్ మూడు పరుగులకే వెనుదిరగ్గా.. ఇర్ఫాన్ 93 పరుగులు చేశాడు. అప్పుడు కుమార సంగక్కర భారత ఆటగాళ్లను బూతులు తిట్టాడని, తనను వ్యక్తిగతంగానూ దూషించాడని ఇర్ఫాన్ పఠాన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. "అది ఢిల్లీలో శ్రీలంకతో జరిగిన టెస్టు మ్యాచ్. నేను రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా వచ్చి 93 పరుగులు చేశాను. ఆ సమయంలో శ్రీలంక ఆటగాళ్లు అసంతృప్తిగా కనిపించారు. ముఖ్యంగా కుమార సంగక్కర కోపంగా ఉన్నాడు. నేను బ్యాటింగ్ చేయడానికి వెళ్లినప్పుడు అసలేం జరిగిందో తెలీదు. ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్‌లో నేను రెండు సిక్సర్లు బాదాను. కొత్త బంతిని ఎదుర్కొని షాట్లు ఆడటంతో వారి ముఖాలు వాడిపోయాయి. శ్రీలంక ప్రణాళికలు దెబ్బతినడంతో వెంటనే సంగక్కర.. 'మీరు మోసగాళ్లు.. మీ తల్లిదండ్రులు మీకేం నేర్పారు" అంటూ బూతులు తిట్టాడు. నన్ను వ్యక్తిగతంగానూ దూషించాడు. నేనూ ఊరుకోకుండా అతడిని తిట్టాను. ఈ ఘటన తర్వాత మేమిద్దరం ఐపీఎల్‌లో పంజాబ్ తరఫున కలిసి ఆడాం. అప్పుడు నేను సంగక్కర దగ్గరకు వెళ్లి సారీ చెప్పాను. అతను కూడా క్షమాపణ కోరాడు. అప్పటి నుంచి మంచి స్నేహితులుగా మారాం. మ్యాచ్ సమయంలో భావోద్వేగాలను నియంత్రించుకోలేక అలా తిట్టుకున్నాం. మనుషులు పొరపాట్లు చేయడం సహజం. అయితే, పరిణతితో వాటిని ఎలా సరిదిద్దుకున్నామనేదే ముఖ్యం" అని ఇర్ఫాన్ పఠాన్ ఆనాటి సంగతులను గుర్తుచేసుకున్నాడు.

# సర్ఫరాజ్‌కు దొరికింది అవకాశం.. జట్టులో పాతుకుపోతాడా?



సర్ఫరాజ్ ఖాన్.. భారత దేశవాళీ క్రికెట్లో స్థిరంగా రాణిస్తున్న ప్లేయర్లలో ఒకడు. టన్నుల కొద్దీ పరుగులు సాధించినా అతడికి మాత్రం చాలా కాలం జట్టులో అవకాశం మాత్రం రాలేదు. కానీ 2024లో ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్.. ఈ రెండేళ్లలో ఆడింది కేవలం 6 టెస్టులే. చివరగా గతేడాది నవంబర్‌లో సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఆడాడు. మళ్లీ సర్ఫరాజ్‌కు చాన్నాళ్ల తర్వాత ఓ అవకాశం దక్కింది. సాయి సుదర్శన్ గాయపడడంతో తాజాగా శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో అతడికి పిలుపొచ్చింది. మరి సర్ఫరాజ్ ఈ అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకుంటాడో!

**ఆరంభంలోనే అదుర్స్**

ప్రతిభావంతుడే కానీ.. సర్ఫరాజ్ ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ ప్రతి మాజీ క్రికెటర్ అనే మాటే ఇది. ఎంత ప్రతిభ ఉన్నా అవకాశాలు రాక చాన్నాళ్లూ దేశవాళీ క్రికెట్‌కే పరిమితమయ్యాడు ఈ ముంబయి బ్యాటర్. రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ లాంటి ఎర్ర బంతి టోర్నీల్లో సెంచరీ మీద సెంచరీలు కొట్టేస్తూ పోయాడు. శతకం సాధించిన ప్రతిసారీ ఇది నా సత్తా అన్నట్లు ఎంతో కసిగా సెలబ్రేషన్ చేసుకునేవాడు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం ఇంగ్లాండ్‌కు తొలి అవకాశం దొరికింది. ఆడిన తొలి టెస్టు తొలి రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ సెంచరీలు (62, 68) చేసి ఆకట్టుకున్నాడు. అదే ఏడాది న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో అదరగొట్టాడు. కానీ అక్కడ నుంచి ఆ సిరీస్‌లో మరో అర్ధసెంచరీ చేయకపోవడంతో సర్ఫరాజ్ జట్టులో చోటు కోల్పోయాడు. మరోవైపు సాయి సుదర్శన్ లాంటి యువ ఆటగాళ్లు టీమ్ఇండియాలోకి దూసుకురావడంతో సర్ఫరాజ్‌కు అవకాశం లేకుండాపోయింది. సర్ఫరాజ్ మళ్లీ తెల్ల దుస్తులల్లో భారత్‌కు ఆడలేదు.

**బరువు తగ్గి..**

సర్ఫరాజ్‌పై ఆరంభం నుంచి ఉన్న ఒకే ఒక్క ఫిర్యాదు అతడి బరువు. అధిక బరువు కారణంగా మైదానంలో ఫీల్డింగ్ చేయడంలో ఇబ్బంది పడడంతో పాటు వికెట్ల మధ్య వేగంగా పరుగులెత్తడంలో విఫలమయ్యేవాడు. ఫిట్‌నెస్ పరీక్షల్లోనూ విఫలమయ్యేవాడు. దీంతో భారత జట్టులో చోటు కోల్పోయిన తర్వాత సర్ఫరాజ్ ముందుగా తన బరువు తగ్గించుకోవడంపై దృష్టి సారించాడు. అవసరం లేని ఆహారాన్ని నియంత్రించి, జిమ్‌లో తీవ్రంగా కష్టపడి తక్కువ సమయంలోనే 17 కిలోల బరువు తగ్గాడు. ఈ ఏడాది ఐపీఎల్ ముంగిట ఫిట్‌గా మారాడు. అతడిని చెన్నై సూపర్ కింగ్స్ రూ.75 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలో దిగి కొన్ని విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడాడు సర్ఫరాజ్. అంతేకాదు దేశవాళీలోనూ తన పరుగుల ప్రవాహాన్ని కొనసాగించాడు 28 ఏళ్ల ఈ కుడి చేతి వాటం బ్యాటర్. రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌పై (227) అదిరే డబుల్ సెంచరీ చేశాడు. స్థిరంగా రాణిస్తున్నా మళ్లీ టెస్టు జట్టు నుంచి మాత్రం పిలుపు దక్కలేదు. అయితే, అతడికి ఇప్పుడు అనుకోకుండా అవకాశం దొరికింది. సాయి సుదర్శన్ పాదం గాయం నుంచి కోలుకోకపోవడంతో సర్ఫరాజ్‌కు మళ్లీ పిలుపొచ్చింది. ఆగస్టు 15న గాలెలో శ్రీలంకతో మొదలయ్యే రెండు టెస్టుల సిరీస్‌లో ఈ ముంబయి బ్యాటర్ ఆడనున్నాడు. అయితే తుది జట్టులో అతడికి ఎంత వరకు అవకాశం ఉంటుందో చూడాలి. ప్రాక్టీస్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన దేవ్‌దత్ పడిక్కల్ నుంచి సర్ఫరాజ్‌కు పోటీఎదురయ్యే అవకాశం ఉంది. స్పిన్‌ను ధాటిగా ఎదుర్కొనే టెక్నిక్ ఉన్న సర్ఫరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కే ఛాన్స్ ఉంది. మరి ఆ అవకాశం వస్తే ఈసారైనా తన ప్రతిభకు న్యాయం చేసి జట్టులో పాతుకుపోతాడేమో చూడాలి.

# కొత్త ఫార్మాట్‌లో వరల్డ్ కప్.. ఐసీసీపై విమర్శలు

2027 వన్డే ప్రపంచ కప్ ఫార్మాట్‌లో మార్పులు చేయడంపై ఐసీసీని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్రంగా విమర్శించాయి. టోర్నీ ఆరంభానికి 18 నెలల కంటే తక్కువ సమయమే ఉన్నా ఐసీసీ గణనీయమైన మార్పులు చేయడం తీవ్ర నిరాశకు గురిచేసిందని రెండు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఈ మార్పులు అసోసియేట్ దేశాల క్రికెట్ అభివృద్ధిని దెబ్బతీసే ప్రమాదముందని.. కొత్త విధానం వల్ల వర్ధమాన దేశాలకు అవకాశాలు తగ్గుతాయని పేర్కొన్నాయి. అసోసియేట్ దేశాలను ప్రభావితం చేసే కీలక నిర్ణయాలు తీసుకునే ముందు మరింతగా సంప్రదింపులు జరిపితే




బాగుండేదని స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు అభిప్రాయపడ్డాయి.

**కొత్త ఫార్మాట్ ఇలా..**

వచ్చే ఏడాది సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా జరగనున్న వరల్డ్ కప్ ఫార్మాట్‌ను ఐసీసీ ఇటీవల మార్చింది. మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. అయితే, అర్హత సాధించిన జట్లలో చివరి మూడు జట్లు సూపర్ సిరీస్‌లో తలపడతాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన జట్టు మిగతా 11 టీమ్‌లతో కలిసి ప్రధాన రౌండ్‌కు అర్హత సాధిస్తుంది. అప్పుడు 12 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి 30 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-3లో నిలిచిన జట్లు తదుపరి రౌండ్‌కు క్వాలిఫై అవుతాయి. అంతేకాకుండా ఈ రెండు గ్రూప్‌ల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన నాలుగో అత్యుత్తమ టీమ్ కూడా అర్హత సాధిస్తుంది. ఈ ఏడు జట్లు మూడో దశ అయిన సూపర్-7లోకి అడుగుపెడతాయి. ఈ రౌండ్‌లో 21 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. టాప్-4 జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com